

యోగా ఇన్‌స్పెక్టర్

- యోగాసనాలతో మెప్పిస్తున్న ఎంవీఐ దినేష్‌చంద్ర
- జలాసనంతో గిన్నీస్ రికార్డు కైవసం



మదనపల్లె మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దినేష్‌చంద్ర

మదనపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాహనాల ఫిట్‌నెస్ బాగుందా లేదా.. అన్నీ సర్టిఫెట్లు ఉన్నాయా.. లైసెన్స్ ఇచ్చేందుకు డ్రైవింగ్ సరిగా చేస్తున్నారా.. ఇలాంటి వన్నీ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) పరిశీలిస్తుంటారు. కానీ ఈ ఎంవీఐ మాత్రం భిన్నం. తన వృత్తిగతమైన పని చేసుకుంటూనే.. యోగాతోనూ మెప్పిస్తున్నారు. జలాసనాలు వేస్తూ అందరూ ఔరా అని ఆశ్చర్యపోయేలా చేస్తున్నారు. గిన్నిస్‌బుక్ రికార్డ్సులోనూ చోటు సాధించారు. ఆయనే మదనపల్లె ఎంవీఐ పాలగిరి దినేష్‌చంద్ర. తన యోగా ప్రస్థానం గురించి ఆయన మాటల్లోనే..

జీవసమాధుల సందర్శన

మాది శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరకముందు నుంచీ యోగా, ఆసనాలు అంటే చాలా ఇష్టం. నంద్యాల, కడప, తిరుపతి, రాయచోటి అనంతరం ప్రస్తుతం మదనపల్లెలో ఎంవీఐగా పనిచేస్తున్నా. ఇప్పటికే యోగాలో క్రియ, సిద్ధయోగ దీక్షలు తీసుకున్నా. అలాగే సిద్ధసమాధి యోగా (ఎస్ఎస్‌వై), మెడిటేషన్, మెడికేషన్ యోగా (ఎంఎంవై) కోర్సులు పూర్తి చేశాను. ఇందులో భాగంగా కడప, అనంతపురం జిల్లాలోని కాశిరెడ్డినాయన, బ్రహ్మంగారిమఠం, సిద్ధగురుస్వామి, పుల్లారెడ్డిస్వామి, గోధుమగురి రంగయ్య స్వామి, వీరా రెడ్డి స్వామి, రావ్యూర్తి గురూజీ తదితరుల జీవసమాధులు, మహిమాన్విత స్థలాలను సందర్శించాను. ఇప్పటికీ జీవించి ఉన్న గురువుల వద్ద యోగా విద్య అభ్యసించా.

స్వామి యోగానంద భారతి వద్ద..


విజయనగరం జిల్లా గజపతినగర మండలం గరిగ చోళపెంట గ్రామానికి చెందిన స్వామియోగానంద భారతి నీటి మీద పద్మాసనంలో కూర్చోగా.. ఆయన కింద నీటిలో మరో వ్యక్తి ఈత కొడుతున్న అద్భుత దృశ్యాన్ని సామాజిక మాధ్యమంలో చూసి నిర్ఘాంత పోయాను. 2020లో ఆయన వద్ద శిష్యునిగా చేరా. ఆయన వద్ద ఆసనాలు నేర్చుకుంటూ.. గురువునే స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నా. పద్మాసనం ఫోజులో నీటిపై పడుకోవాలని ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సాధన మొదలు పెట్టా. ఆరునెలల్లో లక్ష్యం చేరుకోవాలనుకున్నా. అయితే కేవలం 16 రోజుల్లోనే ఈ జలాసనంపై పట్టు సాధించా.

ఆ అనుభవం అద్భుతం

నీటిలో అంతసేపు ఉండటం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. నీటిపై సాధనలో ఉన్నప్పుడు ధ్యానంలోకి వెళ్తాం. మన శరీరం అక్కడే ఉన్నా.. మనస్సు ఎక్కడో ఉంటుంది. ఆ అనుభవం అద్భుతంగా ఉంటుంది. అది మరో ప్రపంచంలా ఉంటుంది. అది అనుభవించినోళ్లకే తెలుస్తుంది. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కూడా లభించింది. యోగా ఆచరణతో ఇంటా బయటా ఉన్నతమైన విలువలతో జీవించే అవకాశం ఉంటుంది. చివర్లో ఉద్యోగానికి కొన్నిరోజులు విరామం తీసుకుని హిమాలయ పర్వతాల్లోని మహావతార బాబాజీ గుహకు వెళ్లి ధ్యానం చేయాలన్నదే ధ్యేయం. ఆ దిశగా సాధన చేస్తున్నా.

అద్భుతాలు సృష్టించవచ్చు

సాధన పద్ధతులు తెలుసుకోవడంతో పాటు వాటిని క్రమం తప్పకుండా సాధన చేయాలి. ప్రతి మనిషిలోనూ అంతర్గత శక్తులు ఉంటాయి. వాటిని సరైన మార్గంలో వినియోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చు. నా విధులకు ఎక్కడా ఆటంకం కలగకుండా ధ్యానం, ఆసనాలు కొనసాగిస్తున్నా. విధుల్లో టార్గెట్లు పూర్తి చేశా. అవధూతలను ఎంతోమందిని కలిశా. కడప జిల్లాలో ఎందరో అవధూతలు ఉన్నారు. వారి సమాధుల వద్ద ధ్యానం చేస్తే మనలో పాజిటివ్ శక్తి పెరుగుతుంది. శ్వాసను హోల్డింగ్ చేసే సమయం పెంచుకోవాలి. అది హఠయోగం ద్వారానే సాధ్యం. స్పిరుచువల్ సాధనతో బాడీ లైట్ వెయిట్ కావాలి. అలాంటి శక్తి మనలోనూ ఉంది. గురువులను సంప్రదిస్తే ఆ మార్గాలను నేర్పిస్తారు.



నీటిపై పడుకుని పద్మాసనంలో ఎంవీఐ దినేష్‌చంద్ర

2 గంటల 2 నిమిషాల 17 సెకన్లు..



ఇటీవల బంధువులు, కుటుంబ సభ్యులతో కలసి బోయకొండ గంగమ్మ ఆలయానికి వెళ్తుండగా, మార్గమధ్యంలోని ఓ తోటలో పెద్ద నీటితొట్టె కనిపించింది. ప్రశాంతంగా ఉన్న ఆ స్థలంలో జలాసనం సాధన చేస్తే బాగుంటుందని అనిపించింది. ఈ ఏడాది జూలై 3వ తేదీ ప్రారంభమైన ఆసనాలు 19వ తేదీతో ముగించా. మొదటి రోజు నీటిపై పడుకుని 30 నిమిషాలు యోగాసనం చేయగా, రెండోరోజు 45 నిమిషాలు, మూడోరోజు 1.12 గంటలు, నాలుగోరోజు 1.32 గంటలు, అయిదోరోజు 2 గంటల 2 నిమిషల 17సెకన్లు నీటిపై పద్మాసనం వేసుకుని పడుకున్నాను. దీంతో గిన్నిస్‌బుక్ రికార్డ్సులోనూ స్థానం సంపాదించా. ఇప్పటి వరకూ నీటిపై పడుకుని పద్మాసనం మాత్రమే వేశా. ఇక ముందు.. మా గురువులా నీటిపై కూర్చొని పద్మాసనం వేసి తీరుతా.

SUNDAY SPECIAL

కొత్త ఎస్పీగా ధీరజ్ కునుబిలి

- ఎస్పీ విద్యాసాగర్ నాయుడు బదిలీ



ధీరజ్ కునుబిలి

రాయచోటి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్త పోలీసు బాస్‌గా ధీరజ్ కునుబిలి రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న విద్యాసాగర్ నాయుడును కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. ధీరజ్ కునుబిలి 2019 ఆంధ్ర క్యాడర్‌కు చెందిన వారు. 2020లో ఐపీఎస్ హోదాలో విధుల్లో చేరారు. తొలుత గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా, కౌంటర్ ఇంటెలిజెన్స్ యూనిట్‌లోనూ పనిచేశారు. ఇప్పటి వరకు పాడేరు ఎస్‌డీపీవోగా 2023 మే 1 నుంచి 2024 ఫిబ్రవరి 4 వరకు, రంపచోడవరం ఎస్‌డీపీవోగా 2024 ఫిబ్రవరి 4 నుంచి 2025 జనవరి 18 వరకు పనిచేశారు. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా ఈ ఏడాది జనవరి 22 నుంచి పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు.

విద్యాసాగర్‌నాయుడు బదిలీ

2024 జూలైలో విద్యాసాగర్‌నాయుడు జిల్లాకు ఎస్పీగా బదిలీపై వచ్చారు. సుమారు 15 నెలల పాటు జిల్లాలో విధులు నిర్వహించిన ఈయనకు ప్రజలతో పాటు పోలీసు సిబ్బందిలోనూ మంచి పేరుంది. శాంతిభద్రతల విషయంలో రాజీపడకుండా పని చేశారనే చెప్పవచ్చు. జిల్లా కేంద్రం రాయచోటిలో సుమారు 30 సంవత్సరాలుగా పోలీసుల కళ్ళుగప్పి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు ఉగ్రవాదులను అరెస్టు చేయడంలో ఈయన పాత్ర ఉంది. ఉగ్రవాదులను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి సూటుకేసు బాంబులు, ఇంకా పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని దేశంలో పలు నగరాలలో జరగాల్సిన విధ్వంసాన్ని అడ్డుకున్నారు. ప్రస్తుతం ఈయనను కృష్ణా జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు.

ఒట్టిపోయాయి...

- రాయచోటిని కబళిస్తున్న కరువు
- ఖరీఫ్‌లో 44 శాతం లోటు వర్షపాతం
- 18 శాతం మాత్రమే సాగైన పంటలు
- ఎండుతున్న వేరుశనగ, నిండని చెరువులు, కుంటలు
- ఈ ఏడాదీ కరువే



సంబేపల్లె మండలం ముదినేనివాండ్లపల్లెలో వ్యవసాయ బావిలో చుక్క నీరు లేక పిచ్చిమొక్కలు మొలిచిన దృశ్యం


జిల్లాలో కరువుకు మారుపేరైన రాయచోటి నియోజకవర్గాన్ని ఈ ఏడాది కరువు పరిస్థితులు కమ్మేస్తున్నాయి. గత మూడేళ్ల నుంచి సరైన వర్షాలు లేక పంటలు సాగుకు నోచుకోలేదు. ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందే వర్షాలు పడినా అనంతరం వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు సాగుకు నోచుకోలేదు. బావులు, వంకలు, చెరువులు నీటి చుక్క లేక ఒట్టిపోయాయి. ఖరీఫ్‌లో ఇప్పటివరకు 18 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి.

వివరాలు 6 లో


తరుముకొస్తున్న వెనుకజలాలు

- బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్న ప్రజలు
- విషపురుగులతో భయం..భయంగా...
- ఇళ్ల పరిహారం కోసం ఎదురు చూస్తున్న రైతన్నలు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెన్నపేరూరు, తప్పెటవారిపల్లె గ్రామాలకు చెందిన రైతులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. సోమశిల జలాశయం నీటి మట్టం పెరిగే కొద్దీ ఇక్కడ రైతుల గుండెలు గుబేల్‌మంటున్నాయి. ఎప్పుడు ఎటువైపు నుంచి వెనుకజలాలు తమ గ్రామాన్ని చుట్టుముట్టి ఇళ్లను ముంచేస్తాయేమోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. మరోపక్క పొలాలు రోజురోజుకు నీటమునుగుతున్నాయి. విషపురుగుల బెడద ఎక్కువగా ఉంది. వృద్ధులు, చిన్నపిల్లలు విషపురుగుల బారిన పడకుండా వారికి కాపలాగా రాత్రులు నిద్రలేకుండా ఉంటున్నారు. బయటకు రావాలంటే భయపడుతున్నారు. శనివారం నాటికి సోమశిల జలాశయంలో 73 టీఎంసీల నీరు చేరాయి. ఇంకో టీఎంసీ నీరు చేరితే ఈ గ్రామాల్లోని ఇళ్లు కూడా నీటమునుగుతాయి. ఇప్పటికే పెన్నపేరూరు నుంచి ఇబ్రహీంపేట గ్రామానికి వెళ్లేదారి పూర్తిగా నీటిలో మునిగిపోయింది. ఇలాంటి పరిస్థితి మండలంలోని పెన్నపేరూరు, తప్పెటవారిపల్లె, వెంకటయ్యపల్లె గ్రామానికి చెందిన రైతులు ఉన్నారు. ఈ గ్రామాలకు చెందిన సుమారు 600 ఎకరాలు సోమశిల వెనుకజలాలతో నీటమునిగిపోతాయి. దీంతో 2009లో రైతులకు పొలాల పరిహారం అప్పటి ప్రభుత్వం చెల్లించింది కానీ ఇళ్లకు మాత్రం ఇంతవరకు పరిహారం అందించలేదు. ఈ రెండు గ్రామాల్లో సుమారు 700 ఇళ్లు ఉన్నాయి. పొలాలకు నష్టపరిహారం అందించారు కానీ ఇళ్లకు పరిహారం చెల్లించకపోవడంతో గ్రామం వదిలి వెళ్లలేకపోతున్నామని ప్రజలు చెబుతున్నారు. ప్రతి ఏడాది ఇదే సమయంలో వరికోతలు ప్రారంభమవుతాయి. ఇదే సమయంలో సోమశిల వెనుక జలాలు కూడా వస్తాయి. పంట చేతికొచ్చే సమయంలో వెనుకజలాలు పొలాలను ముంచేస్తాయి. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇళ్లకు పరిహారం చెల్లిస్తే ఇక్కడ ఖాళీ చేసి వెళ్లిపోతామని రైతులు చెబుతున్నారు. 2009 నుంచి అదిగో ఇస్తాం ఇదిగో ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారేగాని ఇంతవరకు ఇళ్ల పరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ యేడాది సుమారు 30 ఎకరాల వరిపంట నీటమునిగిందన్నారు. ఎకరాకు 30 వేల రూపాయలు నష్టం వాటిల్లిందన్నారు. సోమశిల వెనకజలాలు ముందుగా వస్తాయని తెలిసి కొందరు వరి పంటను యంత్రాల సహాయంతో కోసి ధాన్యాన్ని ఇంటికి తరలించారు. మరికొంతమంది వరిపంటను కోసుకోలేకపోయారు. అలాగే ధాన్యాలను ఇంటికి తరలించారు గాని వరిగడ్డిని తీసుకెళ్లలేకపోయారు. వరిగడ్డి నీటిలో మునిగిపోయింది. అలాగే మిరప, వంగ, సజ్జ పంటలు కూడా నీటిలో మునిగిపోయాయి. వరి గడ్డి చేతికి అందకపోవడంతో ఈ యేడాది పశువుల మేత కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్లకు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



పెన్నపేరూరును చుట్టుముట్టిన వెనుకజలాలు



పొలాలను ముంచేసిన వెనుకజలాలు

పరిహారం చెల్లించి ఆదుకోవాలి



తమ ఇళ్లకు పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి. విషపురుగులతో భయభ్రాంతులకు గురవుతున్నాం. ఏ నిమిషం ఏమి జరుగుతుందోనని భయం భయంగా జీవిస్తున్నాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- కదిరి చంద్రపాల్, రైతు, పెన్నపేరూరు, ఒంటిమిట్ట.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా



రైతుల కష్టాల గురించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం. వర్షాకాలంలో వెనుకజలాలు వస్తే ఇక్కడి ప్రజలు కష్టాలు వర్ణణాతీతం. రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- బి.లక్ష్మీనరసయ్య సర్పంచ్, పెన్నపేరూరు, ఒంటిమిట్ట.



సుగంధ ద్రవ్యాలను తీసుకువస్తున్న ఆలయ అధికారి

వైభవంగా స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయంలో శనివారం స్నపన తిరుమంజన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, మనోజ్‌కుమార్ మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందుగా ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ సుగంధ ద్రవ్యాలను పట్టువస్త్రాలను, పుష్పాలను అలయ అర్చకులకు అందజేశారు. స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామివారి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి సుబ్బరాయుడు దంపతులు, ఆలయ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వై.కోట అడవిలో మేకల కాపరి కిడ్నాప్?

- ఎర్రచందనం స్మగ్లర్ల బరితెగింపు
- నిజం కాదంటున్న అటవీ అధికారులు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వై.కోట అటవీ ప్రాంతంలో మేకలు మేపుకునేందుకు వెళ్లిన కొత్తపల్లె సుబ్బరామయ్య అనే వ్యక్తిని ఎర్రచందనం స్మగ్లర్లు కిడ్నాప్ చేసి కొన్ని గంటల పాటు వారి అదుపులోనే ఉంచుకున్నట్లు గ్రామస్థుల ద్వారా తెలిసింది. ప్రతిరోజు ఉదయం మేకలు తోలుకుని వెళ్లి తిరిగి సాయంత్రం 6.30 గంటలకు ఇంటికి వెళ్లేవాడు. అయితే శుక్రవారం గ్రామ అటవీ పరిధిలో ఉన్న ఉసిరికాయ ప్లాంటు వద్ద మేపుకుంటూ ఉన్నాడు. అదే ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లర్లు (వారు తెలుగు భాష మాట్లాడలేదు) సుమారు 12 మంది ఎర్రచందనం దుంగలను ఒకచోటుకు స్టాకు చేస్తున్నారు. మేకల కాపరి వారికి తారసపడడంతో వారు అతడిని భయపెట్టారు. మేకల కాపరి ఇంటికి తిరిగి వెళితే గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం ఇస్తాడనే అనుమానంతో అతను వారున్న ప్రాంతం నుంచి గుండాలకోన పరిసర ప్రాంతాల వద్దకు సుమారు 7 కిలోమీటర్లు పైబడి తీసుకుని వెళ్లారు. సుమారు రాత్రి 8 గంటల ప్రాంతంలో అతడిని విడిచిపెట్టడంతో రాత్రి అక్కడే పడుకుని శనివారం ఉదయం ఇంటికి వచ్చి కుటుంబసభ్యులు, గ్రామస్థులకు విషయాన్ని తెలిపాడు. సాయంత్రం అయినా మేకలు మేపడానికి వెళ్లిన వ్యక్తి ఇంటికి రాకపోవడంతో వారి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు అతడి కోసం అడవిలో గాలించారు. ఈ క్రమంలో వారి బంధువు ద్విచక్ర వాహనం అటవీ ప్రాంతంలో నిలిపి ఉండగా ఉదయం బీట్ డ్యూటీకి వచ్చిన అటవీశాఖ సిబ్బంది ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపైన డీఎఫ్‌వో శ్యాంసుందర్ మాట్లాడుతూ మేకలు మేపుకునే వ్యక్తిని అడవిలో ఎర్రచందనం స్మగ్లర్లు బెదిరించి కిడ్నాప్ చేశారన్న విషయం ఒట్టి పుకారు మాత్రమే. వీటిపైన ఎలాంటి ఆధారాలు లేవు. అటవీ ప్రాంతంలో గట్టి నిఘా ఏర్పాటు చేశాం.

మెగా లోక్‌అదాలత్‌లో 1187 కేసుల పరిష్కారం

- రూ.70 లక్షల నష్టపరిహారం పంపిణీ



మెగా లోక్‌అదాలత్‌లో కేసులను విచారిస్తున్న జిల్లా 5వ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాయచోటి పట్టణంలోని జిల్లా ఐదవ అదనపు జడ్జి కోర్టులో జరిగిన లోక్‌అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా 1187 కేసులను పరిష్కరించి రూ.70 లక్షల 85 వేల 454 పరిహారం కింద చెల్లించారు. ఈ సందర్భంగా రాయచోటి కోర్టు పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన క్రిమినల్, సివిల్, ప్రమాద కేసులను జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వై.సుయోధన్‌లు ఇరువర్గాల కక్షిదారులను విచారించి రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించి పరిహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి కృష్ణన్‌కుట్టి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాజీమార్గమే రాజమార్గమన్నారు. పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులకు అవగాహన కల్పించి రాజీమార్గం ద్వారా అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

రైలులో నుంచి పడి మహిళకు గాయాలు


ప్రమాదంలో గాయపడిన మహిళ

వాల్మీకిపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి కింద పడి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. శనివారం ఉదయం వాల్మీకిపురం రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకున్న సంఘటన వివరాల్లోకెళితే... సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్న సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలు వాల్మీకిపురం రైల్వే స్టేషన్ దాటుతుండగా స్టేషన్‌కు అత్యంత సమీపంలో ఓ మహిళ రైలు నుంచి కిందికి పడి గాయాలపాలయ్యారు. ఉదయం 6.30 గంటలకు ఆ ప్రాంతంలో పాదచారులు గమనించి స్థానిక రైల్వే స్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. మహిళను వివరాలు ఆరా తీయగా తనది ముదిగుబ్బ ప్రాంతం కురాండ్లపల్లె తండా అని, తనపేరు చెన్నమ్మ బాయ్ తన భర్తపేరు శంకర్‌నాయక్ అని తెలియజేయడం గమనార్హం. గాయపడ్డ మహిళను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించడంలో స్థానికులు సహాయక చర్యలు అందించారు. తలకు గాయమైన చెన్నమ్మబాయ్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని తిరిగి తమ స్వగ్రామానికి వెళ్లిపోయింది. పాదచారులు గమనించడంతో చెన్నమ్మబాయ్ తనను తన కుమారుడే రైలు నుంచి కిందికి తోసినట్లు తెలిపింది.

ఉమ్మడి జిల్లా జట్టుకు మదనపల్లె క్రీడాకారిణి


టెన్నిస్ క్రీడాకారిణి ప్రణీత

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె క్రీడాకారిణి ఉమ్మడి చిత్తూరు జిల్లా టెన్నిస్ జట్టుకు ఎంపికైనట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిశోర్ కుమార్ తెలిపారు. శనివారం తిరుపతిలో టెన్నిస్ అకాడమిలో అండర్-14 బాలబాలికల లాన్‌టెన్నిస్ కోర్టులో నిర్వహించిన సెలెక్షన్స్‌లో ప్రతిభ చూపిన మదనపల్లెవాసి బి.శ్రీధర్‌రెడ్డి కుమార్తె ప్రణీతరెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికైందన్నారు. ఈమె వచ్చేనెల విశాఖపట్నం లేదా విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి టెన్నిస్ సింగిల్స్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు తరఫున పాల్గొంటుందన్నారు. ఈ క్రమంలో మదనపల్లెకు చెందిన సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు ప్రణీతను అభినందించారు.

హార్టికల్చర్ పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో నవీన్‌కు ఆల్ ఇండియా మొదటి ర్యాంకు


ఏనుగుల నవీన్

రామాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన హార్టికల్చర్ పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లో మండలంలోని కసిరెడ్డిగారి పల్లెకు చెందని ఏనుగుల నవీన్ ఆల్ ఇండియా మొదటి ర్యాంకు సాధించాడు. ఈయన మడకశిరలో హార్టీకల్చర్ డిప్లొమా, బీఎస్సీ, ఎంఎస్సీ హార్టికల్చర్ అనంతరాజుపేటలోని ఉద్యాన కళాశాలలో చదివారు. ఈ విద్యార్థి తల్లి ఏనుగుల ఉమాదేవి అంగన్వాడీ టీచర్, తండ్రి అనారోగ్యంతో 2022లో మృతి చెందాడు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

రాజంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో తెలిపారు. గణితం, సైన్సు సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు మాత్రమే ఈనెల 23వ తేదీ లోపు నవోదయ విద్యాలయానికి నేరుగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జవహర్ నవోదయలో సంప్రదించాలని తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పుల్లంపేట విద్యార్థులు


తైక్వాండోకు ఎంపికైన రిషిత్‌వర్మ, కార్తీక — స్కేటింగ్‌కు మనోజ్ఞ

పుల్లంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. రైల్వేకోడూరులో శనివారం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 తైక్వాండతో బాలుర విభాగంలో ఆదర్శ పాఠశాల విద్యార్థి రిషిత్‌వర్మ, బాలికల విభాగంలో కార్తిక, అండర్-19 స్కేటింగ్ విభాగంలో ఆదర్శ పాఠశాలకు చెందిన మనోజ్ఞరాజ్ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చంద్రమోహన్‌రాజు విద్యార్థులను, పీడీ నీలకంఠరావును అభినందించారు.

ప్రసన్న వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటరమణ స్వామి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రమేష్ స్వామి తెల్లవారుజామునే స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలతో నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం వేంకటరమణ స్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంబళ్లపల్లె సివిల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి కీర్తన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, అర్చకులు రమేష్ స్వామి, సిబ్బంది నగేష్‌లు న్యాయాధికారికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.


బొప్పాయి ధర కిలో రూ.8

- సెకండ్ గ్రేడ్ ధర కిలో రూ. 7
- నిర్ణయించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి మొదటి రకం ఎగుమతి ధర కిలో రూ.8, సెకెండ్ గ్రేడ్ ధర కిలో రూ.7గా నిర్ణయించినట్లు శనివారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ట్రేడర్లు తక్కువ ధరకు అమ్మితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తక్కువ ధరకు రైతు నుంచి తీసుకుంటున్నారని రైతులు ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బొప్పాయి రైతులు 95739 90331, 90303 15951 అనే ఫోన్ నెంబర్లకు ఫిర్యాదు చేస్తే తప్పక స్పందించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఒట్టిపోయాయి...


నారాయణరెడ్డిపల్లె గ్రామంలో చుక్కనీరు లేని లింగప్పకుంట


శెట్టిపల్లె గ్రామం గాండ్లపల్లె వద్ద బీడుగా ఉన్న భూములు

- రాయచోటిని కబళిస్తున్న కరువు
- ఖరీఫ్‌లో 44 శాతం లోటు వర్షపాతం
- 18 శాతం మాత్రమే సాగైన పంటలు
- ఎండుతున్న వేరుశనగ, నిండని చెరువులు, కుంటలు
- ఈ ఏడాదీ కరువే


గుట్టపల్లి వద్ద బిందెడు నీటి కోసం కుస్తీపడుతున్న జనం

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో రైతులను కరువు పరిస్థితులు కబళిస్తున్నాయి. బావులు, వంకలు, చెరువులు, వాగులు చుక్కనీరు లేక ఒట్టిపోయాయి. గత రెండు, మూడు సంవత్సరాలుగా కరువు పరిస్థితులను అనుభవించిన రైతులు ఈ ఏడాది గంపెడాశతో ఖరీఫ్ పంట సాగుకు ఎదురుచూశారు. వర్షాలు సకాలంలో పడకపోవడంతో భూములు సాగుకు నోచుకోక ఈ ఏడాది కరువు పరిస్థితులే కనిపిస్తున్నాయి. అడుగంటిన భూగర్భజలం రోజురోజుకు ఒట్టిపోతున్న బోర్లు, వర్షాధారంపై ఆధారపడి పంట సాగు చేపట్టేందుకు ముందుకురాని రైతులు, చుక్క నీరు లేని చెరువులు, కుంటలు ఎండిపోతున్న చెట్లు, వర్షాకాలంలో కూడా భగ్గుమంటున్న ఎండలు, ఇలా కరువు పరిస్థితులు రైతులను వెటాడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో జూన్ నుంచి సెప్టెంబరు వరకు 44 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఖరీఫ్‌లో జిల్లాలో 57 వేల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 10,600 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. దీంతో 18 శాతానికి సాగు పడిపోయింది.

రాయచోటి నియోజక వర్గంలో రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో కరువు తాండవిస్తోంది. పల్లెల్లో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గుక్కెడు బిందె నీళ్ల కోసం గంటల తరబడి నిరీక్షణ చేయాల్సి పరిస్థితి ఏర్పడింది. రాయచోటి మండలం మాధవరం గ్రామం రెడ్డివారిపల్లె ప్రాంతంలో రైతులు ఖరీఫ్‌లో వర్షాధారం కింద వేరుశనగ పంట సాగు చేశారు. వర్షాలు పడకపోవడంతో వేరుశనగ ఎండు ముఖం పట్టింది. కళ్ల ముందు ఎండిపోతున్న కట్టెను చూసి కన్నీరు పెట్టడం తప్ప ప్రయోజనం కనిపించడం లేదు. గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో వెలిగల్లు కాలువ పరీవాహక ప్రాంతాల్లో తప్ప మిగిలిన చోట్ల ఇదే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు.

వర్షాలకు నిండని చెరువులు, కుంటలు

వర్షాకాలం వస్తే చాలు ఒకప్పుడు వంకలు రెండు, మూడు నెలల పాటు నీటి నిల్వలతో నీరు ప్రవహిస్తూ ఉండేవి. నీటి కప్పల శబ్దాలతో చెరువులు, కుంటల్లో సంగీతం వినిపించేది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలించడం లేదు. వర్షాలు అంతంత మాత్రమే పడుతున్నాయి. దీంతో వ్యవసాయ బావులు ఒట్టిపోయాయి. బోరుబావులు బొట్టు రాలుస్తున్నాయి. రాయచోటి నియోజకవర్గంలో 1000కి లోపు కుంటలు, చెరువులు ఉంటాయి. ఎక్కడా నీరు కనిపించడం లేదు. మైదానాన్ని తలపిస్తున్నాయి. చెరువుల కింద ఆయకట్టు భూములు సాగుకు నోచుకోవడం లేదు. ఇలానే పరిస్థితులు కొనసాగితే రైతుల మనుగడ కష్టతరమే.

వరుసగా నష్టాలే



వర్షాలపై ఆధారపడి వేరుశనగ పంట సాగు చేస్తూ ప్రతి సంవత్సరం నష్టాలు తప్ప లాభం లేదు. ఏదో ఒక దశలో నష్టపోతున్నాం తప్ప ప్రయోజనం లేదు. వరుగా కరువు పరిస్థితులే. పెట్టుబడులు పెట్టడం, నష్టపోవడం పంట సాగు చేయాలంటే భయమేస్తోంది. నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

\- కుంచపు సుబ్బయ్య, శెట్టిపల్లి

చెరువుల్లోకి నీరు రాలేదు



రాష్ట్రంలో కోస్తా జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో వరదలతో రైతులు నష్టపోతున్నారు. రాయలసీమ జిల్లాల్లో వర్షాల ప్రభావం పెద్దగా కనిపించలేదు. చెరువుల్లోకి నీరు రాలేదు. శెట్టిపల్లి పెద్దచెరువు లాలా చెరువు చిన్నచెరువు ఇవి నిండి రెండేళ్లు అవుతోంది. ఈసారి నిండేటట్లు కనబడడం లేదు. వరుసగా కరువు తప్ప రైతులకు ప్రయోజనం లేదు. చెరువులు నిండితే తప్ప ప్రయోజనం లేదు. కరువు మండలాలు ప్రకటిస్తున్నారు తప్ప రైతులకు కరువు నుంచి ఉపశమనం కల్పించడం లేదనే చెప్పవచ్చు.

\- కె.రవీంద్రారెడ్డి, శెట్టిపల్లె పెద్దచెరువు, నీటి సంఘం అధ్యక్షుడు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి రెండు జట్లు



రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలుర జట్టు, రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలికల జట్టు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ హైస్కూలు మైదానం లో శనివారం అన్నమయ్య జిల్లా కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యం లో 51వ అండర్-19 జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కడప జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం. చంద్రమోహన్‌రాజు, జిల్లా కబడ్డీ అధ్యక్షులు వి. హరినాథ్, కార్యదర్శి పి. అరుణ మాట్లాడుతూ జిల్లా నుంచి బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికలు పారదర్శకంగా జరిగాయని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఈ జట్లు ఈ నెల 22 నుంచి 25 వరకు విజయవాడలోని గొల్లపూడిలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.క్రీడాకారులు విజయం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఏపీ కోచ్ ఆర్వీ శ్రీధర్, అసోసియేట్ కార్యదర్శి ఎస్. పూజ, కృష్ణారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీవాణి, పీఈటీ పుల్లారావు, స్థానిక ఫిజికల్ డైరెక్టర్, వ్యాయామ ఉపాధ్యాయులు సుదర్శన్, నాగేంద్ర, భాస్కర్, అంజలి, సురేంద్ర, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 1601 కేసులు పరిష్కారం

- జిల్లా జడ్జి ప్రవీణ్‌కుమార్


లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జడ్జి ప్రవీణ్‌కుమార్, న్యాయవాదులు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాజంపేటలో జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసి 1601 కేసులను పరిష్కరించినట్లు మూడవ అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మొత్తం కేసులను పరిష్కరించగా కక్షిదారులకు 61,79,430 రూపాయలు చెల్లించే విధంగా అవార్డులను జారీ చేసినట్లు తెలిపారు. జేఎఫ్‌సీఎం కోర్టులో 1590 క్రిమినల్ కేసులు, 2 సివిల్ కేసులు పరిష్కరించారు. ప్రమాదాలకు సంబంధించిన కేసులను 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో పరిష్కరించగా, పీఎల్‌సీ కేసులను కూడా పరిష్కరించడం జరిగిందన్నారు. చాలాకాలం పెండింగ్‌లో ఉన్న కుటుంబ సభ్యుల భూసమస్యలను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతనాయుడు, ఏపీపీ రామకృష్ణ, ఏజీపీ మౌనిక, న్యాయవాదులు నాగేశ్వరరావు, చౌదరి, శ్రీనివాసులు, రమణ, మౌలానా, భరత్‌రెడ్డి, కాశీ విశ్వనాథ్, తౌఫిక్, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వేద పాఠశాలలో స్వల్ప అపశ్రుతి

- కడప జిల్లా వాసుల అత్యుత్సాహం
- సయోధ్యకు పెద్దల యత్నం


పాఠశాల ఆవరణలో పర్యటిస్తున్న చల్లపల్లి నరసింహారెడ్డి

బి.కొత్తకోట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని గట్టు పంచాయతీ గట్టుపై కేంద్రంగా నిర్వహిస్తున్న ఓ వేద, సంస్కృత పాఠశాలలో ఓ అపశ్రుతి చోటుచేసుకుంది. వ్యాపారంగా మారిన ప్రస్తుత విద్యా విధానంలా కాకుండా భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, విద్యార్థుల మానసిక ఉత్సాహం దిశగా పయనింపజేయడమే లక్ష్యంగా ఈ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన అనూహ్య ఘటనలో ఓ విద్యార్థి కంటికి తీవ్రగాయమైంది. గాయపడిన బాలుడు కడప జిల్లాకు చెందిన వాడు కాగా, గాయం చేసినట్టు చెబుతున్న బాలుడు గట్టు పంచాయతీ వాసిగా తెలుస్తోంది. ఈ ఘటనలో గాయపడిన విద్యార్థి తరఫు వ్యక్తులు పాఠశాలకు వచ్చి రభస సృష్టించడం, పెద్దమొత్తంలో నగదు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం అందుకున్న బీజేపీ సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి శనివారం సంబంధిత పాఠశాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో అనుకోకుండా జరిగిన ఘటనలో యాజమాన్యం, ఆచార్యుల ప్రమేయం ఏమీ లేదన్నారు. కేవలం సేవా దృక్పథంతో నడుస్తున్న వేద పాఠశాలలో ఇలాంటి సంఘటన దురదృష్టకరమని గాయపడిన బాలుడికి తగిన న్యాయం జరిగేలా చూడాలని సూచించడంతో పాటు, యాజమాన్యానికి నైతిక మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పలువురు స్థానిక నాయకులు ఉన్నారు.

దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

విజయదశమి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించాలని బీజేపీ సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి తెలిపారు. పట్టణంలో దసరా ఉత్సవాలను ఈ ఏడాది దుర్గామాత ప్రతిమను ప్రతిష్ఠించి ఘనంగా నిర్వహించాలని పట్టణంలోని కొందరు యువకులు సంకల్పించారు. అందులో భాగంగా జ్యోతిసర్కిల్‌లో ఓ స్థలాన్ని ఎంచుకుని దాని పరిశీలన కోసం బీజేపీ నేత చల్లపల్లిని ఆహ్వానించారు. ఈ మేరకు చల్లపల్లి శనివారం బి.కొత్తకోటకు చేరుకుని ఆ స్థలాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య రాకుండా, ప్రజలకు ఇబ్బంది లేకుండా దుర్గామాత ప్రతిమను ప్రతిష్ఠించి దసరా వేడుకలు నిర్వహించుకుందామని నిర్వాహక కమిటీ సభ్యులకు సూచించారు. విగ్రహ ప్రతిష్ఠకు అనుమతులను సంబంధిత అధికారుల నుంచి తీసుకుందామని, ఆరోగ్యకరమైన వాతారణంలో పట్టణ ప్రజలు ఈ వేడుకను ఆస్వాదించేలా నిర్వహించి ప్రజలు, అధికారవర్గాల మన్ననలు పొందాలన్నారు. అనంతరం సాయంత్రం ఓ ఫంక్షన్‌హాల్లో పట్టణ ప్రముఖులు సమావేశం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై సమాలోచనలు జరిపారు.

కార్పొరేషన్ డైరెక్టర్లుగా మదనపల్లె నేతలు


రామకృష్ణాచారి — మైఫోర్స్ మహేశ్

మదనపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన టీడీపీ, జనసేన నేతలను వివిధ కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ సీనియర్ నేత, ఆర్.కె.జ్యువెలర్ అధినేత బంగారు రామకృష్ణాచారిని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం, అభివృద్ధి కార్పొరేషన్‌కు, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్సు మహేశ్‌ను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా నియమించారు. ఆయా కార్పొరేషన్లకు డైరెక్టర్ పదవితో మా బాధ్యతలు మరింత పెరిగాయని రామకృష్ణాచారి, మహేశ్ పేర్కొన్నారు. తమకు ఈ పదవి అప్పజెప్పిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాష, బంగారు రామకృష్ణాచారి, మైఫోర్సు మహేష్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నాదెళ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా కొండా భాస్కర్‌రెడ్డి


కొండా భాస్కర్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామ సర్పంచ్, మండల టీడీపీ నాయకుడు కొండా భాస్కర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా నియమితులయ్యారు. శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తనను ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు, తన నియామకానికి సహకరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డికి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


యూటీఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు

పీలేరు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో చోటుచేసుకున్న అనేక సమస్యలను సత్వరం పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పీలేరులో నిర్వహించిన యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక చొరవ చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులకు పీఆర్‌సీ బకాయిలు, నాలుగు డీఏల అరియర్స్ ఇంకెప్పుడిస్తారని ప్రశ్నించారు.

2022లో పెట్టిన సంపాదిత సెలవు వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. 15వ తేదీన ప్రారంభం కానున్న యూటీఎఫ్ రణభేరి గోడపత్రికలను ఆవిష్కరించారు. బైక్ ర్యాలీలో ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ బాషా, కోశాధికారి చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడు శివారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి, యూనియన్ నేతలు ఆదినారాయణ, సుధాకర్ నాయుడు, ఆవు విశ్వనాథరెడ్డి, అక్రమ బాషా, రావుద్దీన్, సురేంద్రరెడ్డి, రమణమూర్తి, శ్రీధర్‌రెడ్డి, సుధాకర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కోడూరు ఎక్సైజ్ శాఖాధికారుల అదుపులో గంజాయి స్మగ్లర్లు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట వద్ద శనివారం రాత్రి ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ కేసు విషయంగా ఎక్సైజ్ శాఖ అధికారులను వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలను తర్వాత తెలియచేస్తామని తెలిపారు.

ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం

● 10 గ్రామాల ప్రజల్లో నెలకొన్న ఆనందం



పనులు చేస్తున్న కూలీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దువ్వూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఆరోగ్యకేంద్రం నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. రెండు వారాల నుంచి ఈ పనులు చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో జూలై 3వ తేదీన ఆరోగ్య కేంద్రం నిర్మాణం అంతేనా అనే కథనం ప్రచురితమైంది. రూ.2.50 కోట్ల కేటాయింపుతో చేస్తున్న ఈ పనులు 40 శాతం పూర్తయిన అనంతరం బిల్లుల మంజూరు విషయంలో తలెత్తిన సమస్యలతో పనులు ఆగిపోయాయి. ఈ విషయం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి చొరవ తీసుకుని పూర్తి చేయాలని, తద్వారా పది గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయనే విషయం కథనంలో వివరించింది. దీనికి ఆలస్యంగానైనా స్పందించిన అధికారులు నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈ శివకుమార్ మాట్లాడుతూ 15 రోజుల కిందట పనులు తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఆరోగ్యకేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఆరోగ్యకేంద్రం నిర్మాణం తిరిగి చేపట్టడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బత్తాయి ధర.. పతనం



బత్తాయికి మంగు సోకడంతో..



బత్తాయి కాయలకు మంగు సోకడం వల్ల ధర గణనీయంగా తగ్గింది. జాతీయ రహదారి కారణంగా దుమ్ము, ధూళి చెట్లపై పడడంతో అకారణంగా కాయలన్నీ నల్లగా మారిపోయాయి. పది క్వింటాళ్ల దిగుబడి వస్తుందంటే 4 క్వింటాళ్లే వచ్చింది.

- నరసింహారెడ్డి, చెన్నారెడ్డిపేట

50 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది..



దాదాపు 15 ఎకరాల్లో బత్తాయి సాగు చేశాను. వంద టన్నులు దిగుబడి వస్తుందని ఆశిస్తే 50 టన్నులు మాత్రమే వచ్చింది. ఎకరాకు 4టన్నులు దిగుబడి వచ్చింది. 15ఎకరాలకు మార్కెట్లో టన్ను రూ.12వేల వంతున అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది రూ.20వేలు పలికితే ఈసారి రూ.12వేలు మాత్రమే ధర పలికింది.

- సిద్దు గుర్విరెడ్డి, చెన్నారెడ్డిపేట

పోరుమామిళ్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల పెంపకం లాభదాయకంగా ఉంటుందని ఆశించి దాదాపు ఐదేళ్ల చెట్లను ఫలసాయం వచ్చేంత వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటే తీరా కాపునకు వచ్చేటప్పటికి దిగుబడి తగ్గడం, రేట్లు పతనం కావడంతో అయోమయంలో పడిపోయారు బత్తాయి సాగు చేసిన రైతన్నలు. పోరుమామిళ్ల వ్యవసాయ డివిజను పరిధిలో దాదాపు 900 ఎకరాల్లో బత్తాయి (చీనీ) తోటలు సాగు చేశారు. మండలంలో బొప్పాపురం చెన్నారెడ్డిపేట, పుల్లీడు ప్రాంతాల్లో 150 ఎకరాలు, కాశినాయన మండలంలో 350 ఎకరాలు, బి.మఠం మండలంలో 300 ఎకరాలు, కలసపాడు మండలంలో 60 ఎకరాలు, బి.కోడూరు మండలంలో 130 ఎకరాల వరకు రైతులు చీనీ తోటలను సాగు చేశారు. ఎకరాకు రూ.4లక్షల వరకు పెట్టుబడి పెట్టి ఎకరాకు 120 మొక్కల వరకు పెంచుతారు. ఈ చెట్లను దక్కించుకునేందుకు ఎరువు, మట్టి బోద వేసి కాల్చడం వంటి పనులు చేపడతారు. చెట్టుకు వేరుపురుగు పట్టకుండా చుట్ట బోద వేసి కాలుస్తారు. తీరా కాపునకు వచ్చేసరికి పంట దిగుబడి తగ్గడం, ధర లేకపోవడంతో దిగాలు పడిపోయారు రైతులు. క్వాలిటీ ప్రకారం ఫస్ట్ గ్రేడ్,

● నష్టాల బాటలో చీనీ రైతులు

సెకండ్ గ్రేడ్, థర్డ్ గ్రేడ్ ప్రకారం వ్యాపారస్తులు వాటికి ధరలు నిర్ణయిస్తారు. రూ.8వేల నుంచి రూ.16వేల వరకు గ్రేడ్‌ను బట్టి ధర పలుకుతుంది. ఎకరాకు కనీసం 10 నుంచి 13 టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. కానీ దిగుబడి సగానికి సగం పడిపోవడంతో ఎకరాకు 5, 6 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుంది. గత ఏడాది టన్ను రూ.20వేల ధర పలుకగా ప్రస్తుతం రూ.8వేలు, రూ.10వేలు, రూ.12వేల వరకు ఉంది. అంతేకాకుండా కొన్ని తోటల్లోని చీనీకాయలకు మంగు రావడంతో వ్యాపారస్తులు రేట్లను కూడా తగ్గిస్తున్నారు. బయట మార్కెట్లో వందకు మూడు కేజీలు వంతు అమ్ముతున్నా రైతులు మాత్రం రూ.10కే వ్యాపారస్తులకు అమ్మాల్సి వచ్చిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని, కష్టాలు కన్నీళ్లు నష్టాలే మిగిలాయని బత్తాయి రైతులు వాపోతున్నారు.

ఈ విషయమై ఉద్యానవనశాఖాధికారి శ్రీనివాసులరెడ్డిని వివరణ కోరగా బత్తాయికి రెండు సీజన్లలో కాపు వస్తాయని గ్రేడ్‌ను బట్టి రూ.8వేల నుంచి రూ.16వేల వరకు ధర పలుకుతుందని తెలిపారు. వేసవి సీజన్‌లో ధర పలికి తే రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.



గిట్టుబాటు ధర ఎక్కడ?

అట్లూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): చీనీ కాయలకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలో 1500 ఎకరాల్లో చీనీ సాగు చేశారు. ఎకరాకు ఆరు టన్నుల నుండి పది టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను రూ.30వేలకు దళారులు కొనుగోలు చేస్తే పెట్టుబడులు మాత్రమే వస్తాయని, రూ.30వేలకు పైబడి కొనుగోలు చేస్తే గిట్టుబాటు ధర ఉంటుందని పలువురు రైతులు చెబుతున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితి రూ.15వేలు మాత్రమే ఉండటంతో పెట్టుబడులు కూడా రావని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీనీ కాయలను నెల్లూరు, మద్రాసుకు రవాణా చేసి దళారులు అక్కడ రూ.30వేలకు వరకు విక్రయిస్తూ రైతులను దగా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. 2004 నుండి 2019 వరకు చీనీతోటల పునరుద్ధరణ పేరుతో ప్రభుత్వం చీనీ తోటలు సాగు చేసిన రైతులకు ఎరువులు, చెట్ల కత్తిరింపు కత్తెరలు, ఎకరాకు రూ.12వేల చొప్పున ప్రోత్సాహం ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2022-23లో క్రాప్ డామేజ్‌కు ప్రభుత్వమే ఇన్సురెన్స్ డబ్బులు చెల్లించింది. 2024లో ప్రభుత్వం ఇన్సురెన్స్ డబ్బులు చెల్లించకపోవడంతో రైతులకు క్రాప్ డ్యామేజీ డబ్బులు అందలేదు. అదే బాటలో కూటమి ప్రభుత్వం కూడా ఇన్సురెన్స్ డబ్బులు చెల్లించకపోవడంతో చీనీ తోటలు సాగు చేసిన రైతులకు ప్రోత్సాహం కరువైంది. చీనీ కాయలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగంలో మెరుగైన సేవలు అందించాలి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వైస్‌చాన్సలర్, వైద్యులు

సీకేదిన్నె, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగంలో మెరుగైన సేవలు అందించాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. రాయచోటి రోడ్డులోని మాధవి కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిజిషియన్ అసోసియేషన్ 53వ కాన్ఫరెన్స్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలకు ఎంతో ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను పీజీ విద్యార్థులకు కల్పించి సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలన్నారు. సేవాదృక్పథంతో వైద్య వృత్తిని విస్తరించాలన్నారు. లాభాపేక్ష లేకుండా వృత్తి ధర్మానికి కట్టుబడి మెరుగైన సేవలు అందించినప్పుడే ప్రజల్లో గౌరవ మర్యాదలు దక్కుతాయన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా 800 మందికిపైగా వైద్యులు హాజరై వివిధ ఆవిష్కరణలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఫిజీషియన్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రిమ్స్‌లో సౌకర్యాలను మెరుగుపర్చండి

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కడప నగర శివార్లలో ఉన్న ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్) అభివృద్ధికి ప్రతి ఒక్క అధికారి కృషి చేసి వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన రిమ్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల హెచ్‌వోడీలతో సమావేశమయ్యారు. రిమ్స్ వైద్య కళాశాల చాలా విస్తీర్ణంగా ఉందని, ఆవరణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. వైద్య కళాశాల గెస్ట్ హౌస్, కళాశాల క్యాంటీన్, కళాశాల ఆడిటోరియం, ప్లే గ్రౌండ్‌ను త్వరలో ఏర్పాటు చేసేటట్లు దిశా నిర్దేశం చేశారు. ఆ తర్వాత వైద్య విద్యార్థులతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల డే, ఇతర ఫంక్షన్‌లను ఎలా జరుపుకొంటున్నారని అడగ్గా బయట ప్రాంతాలను బుక్ చేసుకొని వేడుకలు జరుపుకొంటున్నామని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రిమ్స్ ఆడిటోరియం పనులపై దృష్టి సారించాలని, ఆరు నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, వైస్ చాన్సలర్ విజయభాస్కర్‌రెడ్డి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూడు కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. జిల్లాకు చెందిన ఇద్దరికి అవకాశం లభించింది. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బద్వేల్‌కి చెందిన టీడీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డిని, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రొద్దుటూరు టీడీపీ నాయకుడు డాక్టర్ వడ్ల శ్రీనివాసాచారిని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది.

పాఠశాల కరస్పాండెంట్‌పై పోక్సో కేసు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పాఠాలు చెప్పాల్సిన గురువు, కూతురు వయస్సున్న బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించినందుకు శనివారం ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్‌పై మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మైదుకూరు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ బాలికతో ఆ పాఠశాల కరస్పాండెంట్ కొన్ని రోజులు క్రితం అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆ బాలిక జరిగిన విషయాన్ని ఎవ్వరికి చెప్పకుండా ఈనెల 11వ తేదీన విషద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో తల్లిదండ్రులు విషద్రావణం ఎందుకు తాగావని గట్టిగా అడగడంతో బాలిక తన పాఠశాల కరస్పాండెంట్ చేసిన నిర్వాకం బయట పెట్టింది. మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

పెద్దనపాడులో యువతి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనపాడు గ్రామంలో శనివారం రాత్రి యువతి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పెద్దనపాడుకు చెందిన గంగ(24) ఉరి వేసుకున్నట్లు తెలిపారు. ఆమె మృతికి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని, ఆ విషయమై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ప్రేమించిన వాడు మోసం చేయడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా బంధువులు ఆరోపిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై శనివారం రాత్రి ఎస్ఐ నాగమురళి బాధితులను విచారించారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో శనివారం నెల్లూరు-చిత్తూరు, అలాగే కర్నూలు-అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి.

ఏసీఏ క్రికెట్ మైదానంలో..: రిమ్స్ సమీపంలోని వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 554 పరుగులు చేసిన అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 96పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకే కుప్పకూలింది. దీంతో నెల్లూరు జట్టుకు 343 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. భారీ స్కోర్ సాధించే క్రమంలో రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 58 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో..: కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 410 పరుగులకు ఆలౌట్ అయింది. శనివారం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు 11.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 74 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 16.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసింది. దీంతో నిర్వాహకులు మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు ప్రకటించారు. కాగా కర్నూలు జట్టుకు మొదగి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత లభించింది.

కూటమి మైత్రికి భంగం కలిగిస్తున్న ఎమ్మెల్యే

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్న సంగతిని కడప ఎమ్మెల్యే మాధవి మరచిపోయారని, ఆమె కూటమి మైత్రికి భంగం కలిగించేలా బీజేపీ, జనసేన వారిని ఏమాత్రం సంప్రదించకుండా ఒంటెద్దు పోకడతో ముందుకు సాగుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 సంవత్సరంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రస్థాయిలో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా పనిచేస్తూ సుపరిపాలన అందిస్తున్నాయన్నారు. కాగా కడప జిల్లాలో మాత్రం టీడీపీ నాయకులు అందుకు విరుద్ధంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అత్యంత సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. అదే పంథాలో జిల్లాలోని టీడీపీ నాయకులు కూడా సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. బీజేవైయం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి, హత్యాయత్నం కేసు నమోదు

పులివెందుల,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పులివెందుల సమీపంలోని జేఎన్టీయూ వద్ద శుక్రవారం ఆనంద్‌రావు అనే వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని, దీనిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి 6.30గంటల ప్రాంతంలో ఆనందరావు జేఎన్టీయూ కళాశాల సమీపంలో రక్తగాయాలతో రోడ్డు పక్కన పడిపోయారు. ఇది రోడ్డు ప్రమాదమా లేక ఎవరైనా దాడి చేశారా అనే విషయం అప్పుడు వెలుగుచూడలేదు. కానీ ఆనందరావు భార్య కరుణమ్మ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు అరెస్టు

● సుమారు 60కేజీల రాగివైరు స్వాధీనం

గోపవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో చోరీ కాబడిన ట్రాన్స్‌ఫార్మర్ల కేసుల్లో ముగ్గురు నిందితులను శనివారం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. దాసరి శివ, దాసరి ఉపేంద్ర, జగన్నాథం, సాయి కుమార్‌లను అరెస్టు చేసినట్లు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణయ్య తెలిపారు. శనివారం ఉదయం 8గంటల సమయంలో బి.కోడూరు మండలంలోని పెదుళ్లపల్లె గ్రామం క్రాస్ రోడ్డు (బద్వేలు - పోరుమామిళ్ల మెయిన్ రోడ్డు) వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. వీరు ఒక ముఠాగా ఏర్పడి బి.కోడూరు, బద్వేలు, గోపవరం మండలాల్లోని గ్రామాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి రాగివైరును దొంగలించినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని సుమారు 60 కేజీల చోరీ కాబడిన రాగి వైరును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరు పరిచారు. కార్యక్రమంలో బి.కోడూరు సబ్ ఇన్‌స్పెక్టరు సురేశ్, బద్వేలు రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

చెన్నూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఊరేగింపు సందర్భంగా ఎస్సీలను అవమానకరంగా మాట్లాడి కులం పేరుతో దూషించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహులు అన్నారు. చెన్నూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక తూర్పువీధిలో ఎస్సీలు వినాయకచవితి సందర్భంగా గత నెల 28న ఊరేగింపు నిర్వహిస్తుండగా వచ్చే దారిలో ఓ వర్గంవారు ఊరేగింపును అడ్డుకోవడం, పలు రకాల మాటలు మాట్లాడడం జరిగిందన్నారు. పైగా కులం పేరుతో దూషించడం దారుణమన్నారు. ఈ విషయంపై తాము ఫిర్యాదు చేశామని, అయితే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి ఎస్సీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ వల్లూరు మండల అధ్యక్షుడు సురేశ్, చెన్నూరు మండల అధ్యక్షుడు రాంబాబు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు సుదర్శన్, వెంకటసుబ్బయ్య, గంగమ్మ, కొండమ్మ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విచారణ : డీఎస్పీ

చెన్నూరులో వినాయక చవితి సందర్భంగా జరిగిన సంఘటనలో ఎవరికీ అన్యాయం జరగదని, నిష్పక్షపాతంగానే విచారణ జరుగుతోందని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన పలువురు తూర్పు దళితవాడకు చెందిన వారిని జరిగిన సంఘటనపై విచారించి వివరాలను రికార్డు చేసుకున్నారు.

రైల్వేస్టేషన్‌లో కిందపడి వృద్ధుడికి గాయాలు

కొండాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో కిందపడి శనివారం సుమారు 70 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడికి గాయాలయ్యాయి. ఇతడు స్టేషన్‌లో ట్రాక్‌పై ప్రమాదవశాత్తు జారిపడ్డాడా లేదా ఎద్దైనా ట్రైన్‌లో నుంచి జారిపడ్డాడా అని తెలియాల్సి ఉంది. ఇతని తలకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో తాడిపత్రికి తరలించారు. ఇతను రైల్వేస్టేషన్ పరిసరాల్లో బిచ్చమెత్తుకొని జీవిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఇతని వివరాలు తెలియరాలేదు.

మిద్దెకూలి వృద్ధురాలికి గాయాలు

కొండాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురంలో శనివారం దస్తగిరమ్మ(70) అనే వృద్ధురాలికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. ఈమె నివసిస్తున్న మట్టిమిద్దెలో ఇటీవల కురిసిన వర్షాలకు గోడలు మెత్తబడ్డాయి. దీంతో ఇంటి పై కప్పు కూలిపోవడంతో పాటు దంతెలు విరిగి ఆమె మీద పడ్డాయి. తలకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో ఆమెను తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ పదోన్నతులలో పదనిసలొద్దు

● ఆర్టీసీ ఈయూ జోన్ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులలో పదనిసలకు తావు లేకుండా ప్రభుత్వంలో విలీనానికి ముందే చేరిన ఉద్యోగులకు విలీనానికి ముందున్న పాత పద్ధతుల్లోనే పదోన్నతులు కల్పించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కడప ప్రెస్‌కబ్‌లో ఆర్టీసీ జోనల్ అధ్యక్షుడు కేకే కుమార్ అధ్యక్షతన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కడప జోన్‌కు చెందిన 8 జిల్లాల రాష్ట్ర, జోన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో జోన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీలో పదోన్నతులు కల్పించాలని కోరుతూ సంబంధిత ఉద్యోగసంఘాలు పలుమార్లు ఆర్టీసీ ఎండీ దృష్టికి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి గత నెల 28న ఆర్టీసీ ఉద్యోగులకు పాత పద్ధతుల్లోనే పదోన్నతులు ఇచ్చేలా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. ఇందుకు సంబంధించిన జీవో డ్రాఫ్టును టీఆర్ అండ్ బీ అధికారులు జీఏడీ గత నెలలోనే పంపారన్నారు. అయినా అక్కడ ఉన్న ఒక అసిస్టెంట్ కమిషనరు స్థాయి అధికారి అనవసరంగా ఈ పదోన్నతులపై వాదనలు చేస్తూ అడ్డుకోవడం వల్ల ఆరేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఆరువేల మంది ఉద్యోగులు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగులందరికీ గత ప్రభుత్వ హయాంలో జరిగిన రివర్స్ పీఆర్సీపై న్యాయం చేస్తారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటిస్తారని, 12వ పీఆర్సీ వేస్తారని, అలాగే 11వ పీఆర్సీకి సంబంధించిన 24నెలల అరియర్స్‌తో పాటు డీఏ అరియర్స్ కూడా ప్రకటిస్తారని ఎంతగానో ఎదురు చూస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరం అవుతున్నా ఇచ్చిన హామీల అమలులో జాప్యం చేస్తోందన్నారు. ఉద్యోగులు ఉద్యమ బాట పట్టకముందే త్వరితగతిన ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం మున్ముందు విజయవంతంగా ముందుకు సాగాలంటే ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవడం లేదని, మరో మూడు వేల బస్సులు కొనుగోలు చేయాలని, ఆర్టీసీ అన్ని కేటగిరిల్లో ఉన్న సుమారు 10వేల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టాలనుకుంటున్న విద్యుత్ బస్సులన్నీ ప్రైవేటు ఆపరేటర్లతో నడవకుండా ఆర్టీసీ సిబ్బందితో నడిపేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, సుబ్రమణ్యంరాజు, మద్దిలేటి, కడప జోనల్ వర్క్‌షాపు నాయకుడు అంకిరెడ్డి, ఏఆర్ మూర్తి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీతోనే రాజమార్గం



లక్కిరెడ్డిపల్లె సివిల్ కోర్టులో లోక్అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి భరత్‌కుమార్

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజీతోనే రాజమార్గమని లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జి భరత్ కుమార్ అన్నారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్అదాలత్‌లో 8,70,749 రూపాయలు రికవరీ అయినట్టు కోర్టు వర్గాలు తెలిపాయి. సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారం అయ్యాయి. న్యాయవాదులు ఎంఎల్ రామచంద్రా రెడ్డి, బాలాజీరెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి బాధాకరం

● రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి



మృతిచెందిన తెలుగుదేశంపార్టీ కార్యకర్తకు నివాళులర్పిస్తున్న కస్తూరి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగళంపల్లెకు చెందిన తెలుగు దేశంపార్టీ కార్యకర్త కాకర్ల రామచంద్రయ్య(50) శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. కాకర్లవారిపల్లెలో పార్థివదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయాలపాలైన వారి కుటుంబీకులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కేజేపీ రెడ్డయ్య, సీనియర్ నాయకులు కాకర్ల సుబ్బరాయుడు(లారీ), బాలు రామాంజులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నాయుడోరి రమణయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి కాకర్ల రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

పుల్లంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరి. ధిలోని కేతరాజు పల్లెలో సర్వే నంబరు 206లో ప్రభు త్వ భూమిని కబ్జా చేసేందుకు చదును చేయడంతో తహసీ ల్దారు పుల్లారెడ్డి హెచ్చరిక బో ర్డును ఏర్పాటు చేశారు. ప్రభు త్వ భూములు ఆక్రమిస్తే క్రిమి నల్ కేసులు పెడతామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములపై నిఘా పెట్టామని, ఎవరైనా వాటి జోలికి వెళితే చర్యలు తప్పవన్నారు.

ఏటికి ఎదురీత

● వర్షాకాలంలో గ్రామాల దిగ్బంధం
● దశాబ్దాలుగా వంతెన కోసం గ్రామస్థుల ఎదురుచూపు

వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగుతాయి. గ్రామాలు జలదిగ్బంధమవుతాయి. అత్యవసర పరిస్థితుల్లో దాటుతూ గల్లంతవుతుంటారు కూడా. ఇలాంటి ప్రమాదకర వాగులపై వంతెనలు నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నా పాలకులకు వినిపించడం లేదు.



పింఛా నదిపై ఉన్న వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

సుండుపల్లె, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబిడికి దిగువ భాగంలో రాచపల్లి సమీపంలో పింఛా నది ప్రవహిస్తోంది. ఈ నదిపై రాచపల్లి వద్ద దశాబ్దాల కాలం క్రితం వంతెన నిర్మించారు. . పింఛా జలాశయం (యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి ప్రాజెక్టు) నుంచి నీటిని విడుదల చేసినపుడు, లేదా అధికంగా వర్షాలు పడితే ఈ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ సమయంలో రాచపల్లి వంతెన పై నుంచి నీరు ప్రవహిస్తుంది. ఆ సమయంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఈ సమస్య ఆనవాయతీగా మారింది. కొన్ని సంవత్సరాల క్రితం నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో వంతెనపై నుంచి నదికి అవతల ఉండే పల్లెకు ఎద్దుల బండిపై వెళ్లేందుకు ప్రయత్నించిన ఓ మహిళ, ఓ రైతు ఎద్దులతో సహా కొట్టుకుపోయి చనిపోయారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన నాయకులు తాము గెలిస్తే వంతెన నిర్మిస్తామని చెబుతున్నారే తప్ప ఎటువంటి ముందడుగు పడలేదు. సుమారు 20 పల్లెలకు వెళ్లే రహదారి సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.



రెడ్డివారిపల్లె దిగువ భాగంలో బాహుదానదిలో మట్టి రోడ్డు

మట్టి రోడ్డు కోతలతో హైరానా..

రాయవరం నుంచి రెడ్డివారిపల్లెకు వెళ్లే రహదారి ప్రతి ఏడాది వర్షాల కారణంగా కోతకు గురవుతోంది. పింఛా, బాహుదానదుల నీరు ప్రవహించడం వలన రెడ్డివారిపల్లె నుంచి రాయవరం మీదుగా సుండుపల్లెకు వెళ్లే మట్టి రోడ్డు ప్రతి ఏడాది వర్షాల కారణంగా కోతకు గురవుతోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన ఏర్పాటు చేస్తే మాచిరెడ్డిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ ప్రజలకు సమస్య తీరుతుందని ప్రజలు చెబుతున్నారు. ప్రతి ఏడాది కోతకు గురికావడం వలన తిరిగి రోడ్డు వేయడం ఆలస్యం అయితే రవాణాకు తీవ్ర ఆటంకం కలుగుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా వంతెన ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపిస్తాం

సుండుపల్లె మండలంలో తక్కువ ఎత్తులో ఉన్న వంతెలను పరిశీలించాం. పింఛా నదిపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం.

- కుమార్‌బాబు, ఏఈ

ఆపత్సమయంలో మహిళలకు అస్త్రం 'శక్తి యాప్'

● జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన సదస్సులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకొ చ్చిన శక్తియాప్ అస్త్రంలా పనిచేస్తోంది. అన్నమయ్య జిల్లాలోని మహిళలు, బాలికల భద్రత కోసం శక్తి టీమ్ ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాలు విస్తృ తంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ, భద్రత కోసం అందుబాటు లోకి తీసుకువచ్చిన శక్తి యాప్ ప్రాధాన్యతపై శనివారం జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించారు. ఇందులో భాగంగానే జిల్లాలోని ప్రతి మహిళ, ప్రతి బాలిక, ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా ప్లే స్టోర్ ద్వారా శక్తియాప్ డౌన్‌లోడ్ చేసి వ్యక్తిగత వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. ఈ యాప్ ఒక అస్త్రంలా పని చేస్తుందని, ఆపద సమయంలో తక్షణ సహాయానికి ఎంతగానో ఉపయోగపడుతుందని శక్తి టీమ్ అవగాహన కల్పించింది. ఎస్ఓఎస్ బటన్ గానీ, డయల్ 112 ద్వారా ఫిర్యాదు చేసిన వెంటనే 10 నిమిషాల్లో సంబంధిత పోలీసు అధికారులు మహిళల చెంత చేరుకుని రక్షణ చర్యలు చేపడతారని హామీ ఇచ్చారు. ఈ యాప్ వినియోగం, సేవలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై విస్తృత స్థాయిలో మహిళలకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శక్తి టీమ్ పిలుపునిచ్చింది.



శక్తి యాప్‌పై బాలికలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

మార్కెట్‌యార్డు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి : చమర్తి

రాజంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం బోయనపల్లె జాతీయ రహదారి పక్కనున్న వ్యవసాయ మార్కెట్‌యార్డు అభివృద్ధిపై దృష్టిపెట్టాలని తెలుగుదేశంపార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు సూచించారు. శనివారం మార్కెట్ యార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధి కారులకు పలు సూచనలు చేశారు. మార్కెట్‌యార్డు ఆవరణలో చెత్తాచెదారాన్ని, ముళ్లచెట్లను తొలగించి రైతులు, వ్యాపారులకు ఉపయోగపడేలా చూడాలన్నారు. మార్కెట్ యార్డు సెక్రటరీ, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. యార్డులో చేపట్టాల్సిన అభి వృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్‌రాజు, నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్యనాయుడు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డును పరిశీలిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, మార్కెట్‌యార్డు ఛైర్మన్ గన్నే సుబ్బనరసయ్య తదితరులు

రాయచోటిని వదలని చెత్త!

● కంపు కొడుతున్న డ్రైనేజీలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు ప్రధాన రహదారులకే పరిమితం కావడంతో, వీధుల్లో నెలలు తరబడి చెత్తాచెదారం నిలిచి పోతోంది. మురుగు కాలువలను శుభ్రం చేయక పోవడంతో అవి కంపుకొడుతున్నాయి. ఇం దులో 12, 13 వార్డుల పరిస్థితి మరీ దారుణం.



చెత్తా చెదారంతో నిండిన మురుగు కాలువ

నెలల తరబడి శుభ్రం కాని డ్రైనేజీలు:

12వ వార్డులోని ప్రధాన వీధిలోని మురుగు కాలువల్లో 20 రోజుల క్రితం తొలగించిన సిల్టును తొలగించకపోవడంతో స్థానికులు దుర్గంధంతో సహజీవనం చేస్తున్నారు. బిస్మిల్లా డ్రైవింగ్ స్కూల్ వారి వీధిలో డ్రైనేజీలు శుభ్రం చేసి నెలలు గడిచిందని స్థానికులు వాపోతున్నారు. చెత్త సేకరణ సిబ్బంది పది రోజులకోసారి కూడా రాకపోవడంతో చెత్త ఎక్కడ వేయాలో అర్థం కాక నానా అవస్థలు పడుతున్నామంటున్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను మున్సిపాలిటీ అధికారులకు పలు మార్లు చెప్పినా పట్టించుకోలేదంటున్నారు. ఈ వార్డు కౌన్సిలర్ ఎవరో కూడా తమకు అర్థం కావడం లేదని, ఆయన ఎక్కడ ఉంటాడో ఎప్పుడు వస్తా డో కూడా తెలియడం లేదని అంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపి సమ స్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నివాసాల మధ్య చెత్త దిబ్బలు:

నెలల తరబడి చెత్త సేకరించక పోవడంతో 12,13 వార్డుల్లోని ఖాళీ జాగాలన్నీ చెత్తతో నిండిపోతున్నాయి. దీంతో వార్డులోని ప్రతి వీధిలో చెత్త దిబ్బలు కనపడుతున్నాయి. పేరుకే స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ అయినా మౌలిక వసతుల కల్పనలో మాత్రం గ్రామ పంచాయతీ కంటే అధ్వానంగా ఉందని, అన్ని రకాల పన్నులు కడుతున్నా అవసరమైన సౌకర్యాలు మున్సిపల్ అధికారులు కల్పించడం లేదని ఆయా వార్డుల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకొని ప్రతిరోజు చెత్తను సేకరించడంతో పాటు చెత్తదిబ్బలను తొలగించి, డ్రైనేజీలు శుభ్రం చేయాలనివిజ్ఞప్తి చేస్తున్నారు.



12వ వార్డులో నివాసాల మధ్య చెత్తదిబ్బ

మా బాధలు ఎవరికీ పట్టడం లేదు:

డ్రైనేజీలు శుభ్రం చేసి ఎన్ని రోజులైందో మాకే తెలియడం లేదు. చెత్త ఎక్కడ వేయాలో అర్థం కాక అల్లాడుతున్నాం. డ్రైనేజీలు చెత్తతో నిండి కంపు కొడుతుండడంతో దోమల దాడి ఎక్కువైంది. ఎవరెవరో వస్తారు రేపు చేస్తాం, మాపు చేస్తామంటూ మాటలు చెప్పి వెళ్లిపోతున్నారు. ఎవరికి చెప్పినా మా గోడు పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు చొరవ తీసుకొని మా సమస్యలు పరిష్కరించాలి.

- ఖాదర్‌బీ, స్థానికురాలు

'వాకర్స్'గవర్నర్‌గా సుబ్రమణ్యంరాజు

రాజంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలక్ట్ గవర్నర్‌గా చేజర్ల సుబ్రమణ్యంరాజు ఎన్నికయ్యారు. శనివారం తిరుపతిలో వైస్ ప్రెసిడెంట్ శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 303 క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్స్ రీజనల్ కౌన్సిలర్స్, ఏరియా వైస్‌ప్రెసిడెంట్స్, ఛైర్‌పర్సన్స్ పదవుల ఎన్నికకు సమావేశం నిర్వహించామన్నారు. వాకర్స్ గవర్నర్‌గా ఎన్నికైన చేజర్ల సుబ్రమణ్యంరాజును ప్రెసిడెంట్ డాక్టర్ రవిరాజు, డిస్ట్రిక్ట్ గవర్నర్ మాధవనాయుడు, వైస్ ప్రెసిడెంట్ కోనేటి రవిరాజు, శరత్‌కుమార్‌రాజు, మనోహర్, పాండ్యన్, రమేష్, మునికృష్ణ తదితరులు అభినందనలు తెలియజేశారు.



చేజర్ల సుబ్రమణ్యంరాజును అభినందిస్తున్న వాకర్స్ సభ్యులు

సీపీఐ నాయకుడిపై దాడి.. ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

పుల్లంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కేతరాజుపల్లెలో శుక్రవారం అర్ధరాత్రి సీపీఐ నాయకులపై కొందరు వ్యక్తులు దాడి చేయడంతో ఎస్సీ ఎస్టీ యాక్టు కింద కేసు నమోదు చేసిననట్లు పుల్లంపేట ఎస్ఐ శివ కుమార్ తెలిపారు. సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి రాజుబోయిన సెల్వకుమార్ తమ గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమి ఆక్రమణలు అడ్డుకున్నందుకు మూగా వెంకటరెడ్డి, కట్టె సాయికుమార్‌రెడ్డి, పంచగల వెంకటసుబ్బయ్య, మల్లు రాజారెడ్డితో పాటు మరికొందరు దాడి చేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

లాంగ్వేజ్ పండిట్ల సమస్యలు పరిష్కరించాలి

● ఎన్‌టీఏ అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు



కొండూరు శ్రీనివాసరాజుకు వినతిపత్రం అందజేస్తున్న లాంగ్వేజ్ పండితులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చాలా ఏళ్లుగా డీఈవో పూల్‌లో పని చేస్తూ ఉపాధ్యాయ బదిలీలు జరిగిన ప్రతిసారీ శాశ్వత స్థానాలు లేక ఇబ్బంది పడుతున్న లాంగ్వేజ్ పండిట్ల సమస్యకు ఒక శాశ్వత పరిష్కారం చూపాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాయచోటి పట్టణంలోని డైట్ పాఠశాలలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన లాంగ్వేజ్ పండిట్లతో ఆయన మాట్లాడుతూ పండిత, పీఈటీ వ్యవస్థ రద్దై సుమారు ఆరేళ్లు పూర్తయినా సరిపడా పాఠశాల సహాయకులు పోస్టులు లేని కారణంగా రాష్ట్రంలో చాలా మంది పండితులు డీఈవో పూల్‌లో పనిచేస్తూ పదోన్నతికి నోచుకోక శాశ్వత స్థానాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంలో కోర్టు కూడా వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. వీలైనంత త్వరలో ప్రభుత్వంతోనూ, పాఠశాల విద్యాశాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పండిత నాయకులు బీ. శ్రీనివాస దేవేంద్ర, శ్రీనివాస, కిరణ్‌కుమార్, తిరుపాల్, మురళి, శృతి, లావణ్య రేటీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దళిత రణభేరిని విజయవంతం చేయండి

సుండుపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ అధ్యక్షతన ఈ నెల 24న ధర్నా చౌక్, గాంధీనగర్, విజయవాడలో జరిగే దళిత రణభేరి కార్యక్రమానికి దళిత బిడ్డలు తరలిరావాలని అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి వెంకటరమణ, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యుగంధర్ కోరారు. శనివారం మండలంలోని పెద్దమాదిగపల్లి, రాయవరం, పింఛా గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. దళితులపై దాడులకు నిరసనగా విజయవాడలో దళిత రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా కానీ దళితుల హత్యలు, అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు ఆగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కార్యదర్శి పెద్దివీటి నరసింహులు, రాయచోటి అసెంబ్లీ అధ్యక్షులు నాగేశ్వర్, పట్టణ అధ్యక్షులు మహేశ్, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

చిట్వేలి, సెప్టెంబరు 13 (ఆం ధ్రజ్యోతి) : జానపద కళలు పూర్వీకులు మనకు ఇచ్చిన గొప్ప వరాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు బి.దుర్గరాజు అన్నారు. జిల్లా స్థాయి కళా ఉత్సవ్ 2025 పోటీల్లో చిట్వేలి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి టి. ఈశ్వరి క్లాసికల్ డ్యాన్స్‌లో తృతీయ బహుమతి సాధించిన సందర్భంగా శనివారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు మాట్లాడుతూ చదువుతో పాటు మనదేశ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసే విధంగా నైపుణ్యం ప్రదర్శించాలన్నారు. గైడ్ టీచర్లు శ్రీకాంతి, విజయలక్ష్మీలను ప్రధానోపాధ్యా యులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు అభినందించారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఎఫ్ఎల్ సభ్యులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ, సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ ప్రతినిధులు ప్రతాప్, శ్రీహరి, వెలుగు సీసీ మహేష్ తెలిపారు. శనివారం ఓబనపల్లె పంచాయతీ కేంద్రంలోని ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రతి ఒక్కరు బ్యాంకు ఖాతా కు నామిని కలిగి ఉండాలన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతిబీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఎన్పీఎస్ వాత్సల్య, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లు చేసి మీ బ్యాంకు నెంబరు, ఆధార్ నెంబరు చెప్పాలని అడిగితే ఇవ్వవద్దని తెలిపారు. అలాగని ఇస్తే డబ్బంతా దోచేస్తారన్నారు. డబ్బులను ఆర్డీలు, ఫిక్స్ డిపాజిట్లు, పీపీఎఫ్ వంటి ఖాతాలలో పెట్టుకోవడం వల్ల అధికంగా ఆదాయం వస్తుందన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలన్నారు. పదేళ్లు నిండిన వారు, జేడీపై ఖాతా కల్గిన వారు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీవో కవిత, గ్రామ ప్రజలు, స్వయం సహాయక బృందాల సభ్యులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ స్కీం వర్తింపజేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

పుల్లంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీం వర్తింపజేయా లని పుల్లంపేట ఉపాధ్యాయులు శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. తాము 2003 డీఎస్సీలో ఎంపికైనా ప్రభుత్వం 2005లో ఉద్యోగం కల్పించిందన్నారు. ప్రభుత్వం అప్పట్లో చేసిన అలసత్వం వల్ల కొత్త పెన్షన్ స్కీంలోకి వచ్చామని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో నెంబరు 57 ప్రకారం అలసత్వం చేసినవారికి పాత పెన్షన్ స్కీం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను 16 రాష్ట్రాలు అమలు చేశాయని ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా అమలు కాలేదని ఇక్కడ కూడా అమలయ్యేవిధంగా ప్రభుత్వంతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, మునగపాటి శ్రీనివాసులు, మాధవమూర్తి, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాయత్నం అడ్డగింత

నందలూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని ఆడపూరు గ్రామ పంచా యతి పరిధిలోని సర్వేనంబరు 571/బిలోని 1.20 సెంట్ల ప్రభుత్వ భూమి కబ్జా య త్నాలను శనివారం కొండయ్య పల్లె దళితులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దళితులు మా ట్లాడుతూ తమకు ఆ భూమిలో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దారును, కలెక్టర్‌ను కోరామని, కానీ శనివారం శ్రీనివాసులరెడ్డి మరి కొందరు వ్యక్తులు ఆ భూమిలో కంచె వేయడానికి ప్రయత్నిస్తుండగా తాము అడుకున్నామన్నారు. ఈ విషయంపై స్థానిక ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి ఫిర్యా దు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు న్యాయం చేయాలని దళితులు కోరారు.

'వైసీపీ బాటలోనే టీడీపీ ప్రభుత్వం'

రాజంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి తేడా ఏముందో చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య సీఎంను ప్రశ్నించారు. శనివారం స్థానిక ఏఐయూటీసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలు తీసుకువస్తే, ప్రస్తుత ప్రభుత్వం వాటిని ప్రైవేటుకు అప్పగించడం, ఉన్న కళాశాలలను సైతం తాము నడపలేమని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఉత్తరాలు రాయడం దారుణమన్నారు. ఎన్నికల ముందు స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పగులగొట్టండని ప్రకటించిన లోకేశ్ ప్రస్తుతం గత ప్రభుత్వ ఆలోచనల విధానాలే కొనసాగిస్తున్నారన్నారు. ఈ దేశ సమగ్రతను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడడంలో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు పి.మహేష్, సికిందర్, నాగేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

రైలులో నుంచి పడి మహిళకు గాయాలు


ప్రమాదంలో గాయపడిన మహిళ

వాల్మీకిపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి కింద పడి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. శనివారం ఉదయం వాల్మీకిపురం రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకున్న సంఘటన వివరాల్లోకెళితే... సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్న సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలు వాల్మీకిపురం రైల్వే స్టేషన్ దాటుతుండగా స్టేషన్‌కు అత్యంత సమీపంలో ఓ మహిళ రైలు నుంచి కిందికి పడి గాయాలపాలయ్యారు. ఉదయం 6.30 గంటలకు ఆ ప్రాంతంలో పాదచారులు గమనించి స్థానిక రైల్వే స్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. మహిళను వివరాలు ఆరా తీయగా తనది ముదిగుబ్బ ప్రాంతం కురాండ్లపల్లె తండా అని, తనపేరు చెన్నమ్మ బాయ్ తన భర్తపేరు శంకర్‌నాయక్ అని తెలియజేయడం గమనార్హం. గాయపడ్డ మహిళను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించడంలో స్థానికులు సహాయక చర్యలు అందించారు. తలకు గాయమైన చెన్నమ్మబాయ్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని తిరిగి తమ స్వగ్రామానికి వెళ్లిపోయింది. పాదచారులు గమనించడంతో చెన్నమ్మబాయ్ తనను తన కుమారుడే రైలు నుంచి కిందికి తోసినట్లు తెలిపింది.

ఉమ్మడి జిల్లా జట్టుకు మదనపల్లె క్రీడాకారిణి


టెన్నిస్ క్రీడాకారిణి ప్రణీత

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె క్రీడాకారిణి ఉమ్మడి చిత్తూరు జిల్లా టెన్నిస్ జట్టుకు ఎంపికైనట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిశోర్ కుమార్ తెలిపారు. శనివారం తిరుపతిలో టెన్నిస్ అకాడమిలో అండర్-14 బాలబాలికల లాన్‌టెన్నిస్ కోర్టులో నిర్వహించిన సెలెక్షన్స్‌లో ప్రతిభ చూపిన మదనపల్లె వాసి బి.శ్రీధర్‌రెడ్డి కుమార్తె ప్రణీతరెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికైందన్నారు. ఈమె వచ్చేనెల విశాఖపట్నం లేదా విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి టెన్నిస్ సింగిల్స్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు తరపున పాల్గొంటుందన్నారు. ఈ క్రమంలో మదనపల్లెకు చెందిన సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు ప్రణీతను అభినందించారు.

హార్టికల్చర్ పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో నవీన్‌కు ఆల్ ఇండియా మొదటి ర్యాంకు


ఏనుగుల నవీన్

రామాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన హార్టికల్చర్ పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లో మండలంలోని కసిరెడ్డిగారి పల్లెకు చెందని ఏనుగుల నవీన్ ఆల్ ఇండియా మొదటి ర్యాంకు సాధించాడు. ఈయన మడకశిరలో హార్టికల్చర్ డిప్లొమా, బీఎస్సీ, ఎంఎస్సీ హార్టికల్చర్ అనంతరాజుపేటలోని ఉద్యాన కళాశాలలో చదివారు. ఈ విద్యార్థి తల్లి ఏనుగుల ఉమాదేవి అంగన్వాడీ టీచర్, తండ్రి అనారోగ్యంతో 2022లో మృతి చెందాడు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

రాజంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో తెలిపారు. గణితం, సైన్సు సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు మాత్రమే ఈనెల 23వ తేదీ లోపు నవోదయ విద్యాలయానికి నేరుగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జవహర్ నవోదయలో సంప్రదించాలని తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పుల్లంపేట విద్యార్థులు


తైక్వాండోకు ఎంపికైన రిషిత్‌వర్మ, కార్తీక స్కేటింగ్‌కు మనోజ్ఞ

పుల్లంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. రైల్వేకోడూరులో శనివారం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 తైక్వాండలో బాలుర విభాగంలో ఆదర్శ పాఠశాల విద్యార్థి రిషిత్‌వర్మ, బాలికల విభాగంలో కార్తీక, అండర్-19 స్కేటింగ్ విభాగంలో ఆదర్శ పాఠశాలకు చెందిన మనోజ్ఞరాజ్ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చంద్రమోహన్‌రాజు విద్యార్థులను, పీడీ నీలకంఠరావును అభినందించారు.

ప్రసన్న వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటరమణ స్వామి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రమేష్ స్వామి తెల్లవారుజామునే స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలతో నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం వేంకటరమణ స్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంబళ్లపల్లె సివిల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి కీర్తన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, అర్చకులు రమేష్ స్వామి, సిబ్బంది నగేష్‌లు న్యాయాధికారికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

బొప్పాయి ధర కిలో రూ.8

● *సెకండ్ గ్రేడ్ ధర కిలో రూ. 7*

● *నిర్ణయించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్*

రైల్వేకోడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి మొదటి రకం ఎగుమతి ధర కిలో రూ.8, సెకెండ్ గ్రేడ్ ధర కిలో రూ.7గా నిర్ణయించినట్లు శనివారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ట్రేడర్లు తక్కువ ధరకు అమ్మితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తక్కువ ధరకు రైతు నుంచి తీసుకుంటున్నారని రైతులు ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బొప్పాయి రైతులు 95739 90331, 90303 15951 అనే ఫోన్ నెంబర్లకు ఫిర్యాదు చేస్తే తప్పక స్పందించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఒట్టిపోయాయి...


● **రాయచోటిని కబళిస్తున్న కరువు**

● **ఖరీఫ్‌లో 44 శాతం లోటు వర్షపాతం**

● **18 శాతం మాత్రమే సాగైన పంటలు**

● **ఎండుతున్న వేరుశనగ, నిండని చెరువులు, కుంటలు**

● **ఈ ఏడాదీ కరువే**


శెట్టిపల్లె గ్రామం గాండ్లపల్లె వద్ద బీడుగా ఉన్న భూములు


నారాయణరెడ్డిపల్లె గ్రామంలో చుక్కనీరు లేని లింగప్పకుంట

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో రైతులను కరువు పరిస్థితులు కబళిస్తున్నాయి. బావులు, వంకలు, చెరువులు, వాగులు చుక్కనీరు లేక ఒట్టిపోయాయి. గత రెండు, మూడు సంవత్సరాలుగా కరువు పరిస్థితులను అనుభవించిన రైతులు ఈ ఏడాది గంపెడాశతో ఖరీఫ్ పంట సాగుకు ఎదురుచూశారు. వర్షాలు సకాలంలో పడకపోవడంతో భూములు సాగుకు నోచుకోక ఈ ఏడాది కరువు పరిస్థితులే కనిపిస్తున్నాయి. అడుగంటిన భూగర్భజలం రోజురోజుకు ఒట్టిపోతున్న బోర్లు, వర్షాధారంపై ఆధారపడి పంట సాగు చేపట్టేందుకు ముందుకురాని రైతులు, చుక్కనీరు లేని చెరువులు, కుంటలు ఎండిపోతున్న చెట్లు, వర్షాకాలంలో కూడా భగ్గుమంటున్న ఎండలు, ఇలా కరువు పరిస్థితులు రైతులను వెటాడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో జూన్ నుంచి సెప్టెంబరు వరకు 44 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఖరీఫ్‌లో జిల్లాలో 57 వేల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 10,600 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. దీంతో 18 శాతానికి సాగు పడిపోయింది.


గుట్టపల్లి వద్ద బిందెడు నీటి కోసం కుస్తీపడుతున్న జనం

రాయచోటి నియోజక వర్గంలో రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో కరువు తాండవిస్తోంది. పల్లెల్లో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గుక్కెడు బిందె నీళ్ల కోసం గంటల తరబడి నిరీక్షణ చేయాల్సి పరిస్థితి ఏర్పడింది. రాయచోటి మండలం మాధవరం గ్రామం రెడ్డివారిపల్లె ప్రాంతంలో రైతులు ఖరీఫ్‌లో వర్షాధారం కింద వేరుశనగ పంట సాగు చేశారు. వర్షాలు పడకపోవడంతో వేరుశనగ ఎండు ముఖం పట్టింది. కళ్ల ముందు ఎండిపోతున్న కట్టెను చూసి కన్నీరు పెట్టడం తప్ప ప్రయోజనం కనిపించడం లేదు. గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో వెలిగల్లు కాలువ పరీవాహక ప్రాంతాల్లో తప్ప మిగిలిన చోట్ల ఇదే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు.

వరుసగా నష్టాలే



వర్షాలపై ఆధారపడి వేరుశనగ పంట సాగు చేస్తూ ప్రతి సంవత్సరం నష్టాలు తప్ప లాభం లేదు. ఏదో ఒక దశలో నష్టపోతున్నాం తప్ప ప్రయోజనం లేదు. వరుగా కరువు పరిస్థితులే. పెట్టుబడులు పెట్టడం, నష్టపోవడం పంట సాగు చేయాలంటే భయమేస్తోంది. నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- కుంచపు సుబ్బయ్య, శెట్టిపల్లి

వర్షాలకు నిండని చెరువులు, కుంటలు

వర్షాకాలం వస్తే చాలు ఒకప్పుడు వంకలు రెండు, మూడు నెలల పాటు నీటి నిల్వలతో నీరు ప్రవహిస్తూ ఉండేవి. నీటి కప్పల శబ్దాలతో చెరువులు, కుంటల్లో సంగీతం వినిపించేది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలించడం లేదు. వర్షాలు అంతంత మాత్రమే పడుతున్నాయి. దీంతో వ్యవసాయ బావులు ఒట్టిపోయాయి. బోరుబావులు బొట్టు రాలుస్తున్నాయి. రాయచోటి నియోజకవర్గంలో 1000కి లోపు కుంటలు, చెరువులు ఉంటాయి. ఎక్కడా నీరు కనిపించడం లేదు. మైదానాన్ని తలపిస్తున్నాయి. చెరువుల కింద ఆయకట్టు భూములు సాగుకు నోచుకోవడం లేదు. ఇలానే పరిస్థితులు కొనసాగితే రైతుల మనుగడ కష్టతరమే.

చెరువుల్లోకి నీరు రాలేదు



రాష్ట్రంలో కోస్తా జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో వరదలతో రైతులు నష్టపోతున్నారు. రాయలసీమ జిల్లాల్లో వర్షాల ప్రభావం పెద్దగా కనిపించలేదు. చెరువుల్లోకి నీరు రాలేదు. శెట్టిపల్లి పెద్దచెరువు లాలా చెరువు చిన్నచెరువు ఇవి నిండి రెండేళ్లు అవుతోంది. ఈసారి నిండేటట్టు కనబడడం లేదు. వరుసగా కరువు తప్ప రైతులకు ప్రయోజనం లేదు. చెరువులు నిండితే తప్ప ప్రయోజనం లేదు. కరువు మండలాలు ప్రకటిస్తున్నారు తప్ప రైతులకు కరువు నుంచి ఉపశమనం కల్పించడం లేదనే చెప్పవచ్చు.

- కె.రవీంద్రారెడ్డి, శెట్టిపల్లె పెద్దచెరువు, నీటి సంఘం అధ్యక్షుడు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి రెండు జట్లు



రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలుర జట్టు, రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలికల జట్టు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ హైస్కూలు మైదానం లో శనివారం అన్నమయ్య జిల్లా కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యం లో 51వ అండర్-19 జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కడప జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం. చంద్రమోహన్‌రాజు, జిల్లా కబడ్డీ అధ్యక్షులు వి. హరినాథ్, కార్యదర్శి పి. అరుణ మాట్లాడుతూ జిల్లా నుంచి బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికలు పారదర్శకంగా జరిగాయని తెలిపారు. జిల్లా నలుమూల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఈ జట్లు ఈ నెల 22 నుంచి 25 వరకు విజయవాడలోని గొల్లపూడిలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.క్రీడాకారులు విజయం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏపీ కోచ్ ఆర్వీ శ్రీధర్, అసోసియేట్ కార్యదర్శి ఎస్. పూజ, కృష్ణారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీవాణి, పీఈటీ పుల్లారావు, స్థానిక ఫిజికల్ డైరెక్టర్, వ్యాయామ ఉపాధ్యాయులు సుదర్శన్, నాగేంద్ర, భాస్కర్, అంజలి, సురేంద్ర, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 1601 కేసులు పరిష్కారం

● *జిల్లా జడ్జి ప్రవీణ్‌కుమార్*



లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జడ్జి ప్రవీణ్‌కుమార్, న్యాయవాదులు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల న్యాయ సేవా ఆధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాజంపేటలో జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసి 1601 కేసులను పరిష్కరించినట్లు మూడవ అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మొత్తం కేసులను పరిష్కరించగా కక్షిదారులకు 61,79,430 రూపాయలు చెల్లించే విధంగా అవార్డులను జారీ చేసినట్లు తెలిపారు. జేఎఫ్‌సీఎం కోర్టులో 1590 క్రిమినల్ కేసులు, 2 సివిల్ కేసులు పరిష్కరించారు. ప్రమాదాలకు సంబంధించిన కేసులను 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో పరిష్కరించగా, పీఎల్‌సీ కేసులను కూడా పరిష్కరించడం జరిగిందన్నారు. చాలాకాలం పెండింగ్‌లో ఉన్న కుటుంబ సభ్యుల భూసమస్యలను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతనాయుడు, ఏపీపీ రామకృష్ణ, ఏజీపీ మౌనిక, న్యాయవాదులు నాగేశ్వరరావు, చౌదరి, శ్రీనివాసులు, రమణ, మౌలానా, భరత్‌రెడ్డి, కాశీ విశ్వనాథ్, తౌఫిక్, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వేద పాఠశాలలో స్వల్ప అపశ్రుతి

● *కడప జిల్లా వాసుల అత్యుత్సాహం*

● *సయోధ్యకు పెద్దల యత్నం*


పాఠశాల ఆవరణలో పర్యటిస్తున్న చల్లపల్లి నరసింహారెడ్డి

బి.కొత్తకోట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని గట్టు పంచాయతీ గట్లపై కేంద్రంగా నిర్వహిస్తున్న ఓ వేద, సంస్కృత పాఠశాలలో ఓ అపశ్రుతి చోటుచేసుకుంది. వ్యాపారంగా మారిన ప్రస్తుత విద్యా విధానంలా కాకుండా భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, విద్యార్థుల మానసిక ఉత్సాహం దిశగా పయనింపజేయడమే లక్ష్యంగా ఈ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన అనూహ్య ఘటనలో ఓ విద్యార్థి కంటికి తీవ్రగాయమైంది. గాయపడిన బాలుడు కడప జిల్లాకు చెందిన వాడు కాగా, గాయం చేసినట్టు చెబుతున్న బాలుడు గట్టు పంచాయతీ వాసిగా తెలుస్తోంది. ఈ ఘటనలో గాయపడిన విద్యార్థి తరపు వ్యక్తులు పాఠశాలకు వచ్చి రభస సృష్టించడం, పెద్దమొత్తంలో నగదు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం అందుకున్న బీజేపీ సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి శనివారం సంబంధిత పాఠశాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో అనుకోకుండా జరిగిన ఘటనలో యాజమాన్యం, ఆచార్యుల ప్రమేయం ఏమీ లేదన్నారు. కేవలం సేవా దృక్పథంతో నడుస్తున్న వేద పాఠశాలలో ఇలాంటి సంఘటన దురదృష్టకరమని గాయపడిన బాలుడికి తగిన న్యాయం జరిగేలా చూడాలని సూచించడంతో పాటు, యాజమాన్యానికి నైతిక మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పలువురు స్థానిక నాయకులు ఉన్నారు.

దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

విజయదశమి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించాలని బీజేపీ సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి తెలిపారు. పట్టణంలో దసరా ఉత్సవాలను ఈ ఏడాది దుర్గామాత ప్రతిమను ప్రతిష్ఠించి ఘనంగా నిర్వహించాలని పట్టణంలోని కొందరు యువకులు సంకల్పించారు. అందులో భాగంగా జ్యోతిసర్కిల్‌లో ఓ స్థలాన్ని ఎంచుకుని దాని పరిశీలన కోసం బీజేపీ నేత చల్లపల్లిని ఆహ్వానించారు. ఈ మేరకు చల్లపల్లి శనివారం బి.కొత్తకోటకు చేరుకుని ఆ స్థలాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య రాకుండా, ప్రజలకు ఇబ్బంది లేకుండా దుర్గామాత ప్రతిమను ప్రతిష్ఠించి దసరా వేడుకలు నిర్వహించుకుందామని నిర్వాహక కమిటీ సభ్యులకు సూచించారు. విగ్రహ ప్రతిష్ఠకు అనుమతులను సంబంధిత అధికారుల నుంచి తీసుకుందామని, ఆరోగ్యకరమైన వాతారణంలో పట్టణ ప్రజలు ఈ వేడుకను ఆస్వాదించేలా నిర్వహించి ప్రజలు, అధికారవర్గాల మన్ననలు పొందాలన్నారు. అనంతరం సాయంత్రం ఓ ఫంక్షన్‌హాల్లో పట్టణ ప్రముఖులు సమావేశం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై సమాలోచనలు జరిపారు.

కార్పొరేషన్ డైరెక్టర్లుగా మదనపల్లె నేతలు


రామకృష్ణాచారి మైఫోర్స్ మహేశ్

మదనపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన టీడీపీ, జనసేన నేతలను వివిధ కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ సీనియర్ నేత, ఆర్.కె.జ్యువెలర్ అధినేత బంగారు రామకృష్ణాచారిని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం, అభివృద్ధి కార్పొరేషన్‌కు, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్సు మహేశ్‌ను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా నియమించారు. ఆయా కార్పొరేషన్లకు డైరెక్టర్ పదవితో మా బాధ్యతలు మరింత పెరిగాయని రామకృష్ణాచారి, మహేశ్ పేర్కొన్నారు. తమకు ఈ పదవి అప్పజెప్పిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాష, బంగారు రామకృష్ణాచారి, మైఫోర్సు మహేష్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నాదెళ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా కొండా భాస్కర్‌రెడ్డి


కొండా భాస్కర్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామ సర్పంచ్, మండల టీడీపీ నాయకుడు కొండా భాస్కర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా నియమితులయ్యారు. శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తనను ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు, తన నియామకానికి సహకరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డికి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


యూటీఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

● *యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు*

పీలేరు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో చోటుచేసుకున్న అనేక సమస్యలను సత్వరం పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పీలేరులో నిర్వహించిన యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక చొరవ చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులకు పీఆర్‌సీ బకాయిలు, నాలుగు డీఏల అరియర్స్ ఇంకెప్పుడిస్తారని ప్రశ్నించారు.

2022లో పెట్టిన సంపాదిత సెలవు వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. 15వ తేదీన ప్రారంభం కానున్న యూటీఎఫ్ రణభేరి గోడపత్రికలను ఆవిష్కరించారు. బైక్ ర్యాలీలో ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ బాషా, కోశాధికారి చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడు శివారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి, యూనియన్ నేతలు ఆదినారాయణ, సుధాకర్ నాయుడు, ఆవు విశ్వనాథరెడ్డి, అక్రమ బాషా, రావుద్దీన్, సురేంద్రరెడ్డి, రమణమూర్తి, శ్రీధర్‌రెడ్డి, సుధాకర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కోడూరు ఎక్సైజ్ శాఖాధికారుల అదుపులో గంజాయి స్మగ్లర్లు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట వద్ద శనివారం రాత్రి ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ కేసు విషయంగా ఎక్సైజ్ శాఖ అధికారులను వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలను తర్వాత తెలియచేస్తామని తెలిపారు.

ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం

● 10 గ్రామాల ప్రజల్లో నెలకొన్న ఆనందం



పనులు చేస్తున్న కూలీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దువ్వూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఆరోగ్యకేంద్రం నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. రెండు వారాల నుంచి ఈ పనులు చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో జూలై 3వ తేదీన ఆరోగ్య కేంద్రం నిర్మాణం అంతేనా అనే కథనం ప్రచురితమైంది. రూ.2.50 కోట్ల కేటాయింపుతో చేస్తున్న ఈ పనులు 40 శాతం పూర్తయిన అనంతరం బిల్లుల మంజూరు విషయంలో తలెత్తిన సమస్యలతో పనులు ఆగిపోయాయి. ఈ విషయం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి చొరవ తీసుకుని పూర్తి చేయాలని, తద్వారా పది గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయనే విషయం కథనంలో వివరించింది. దీనికి ఆలస్యంగానైనా స్పందించిన అధికారులు నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ డీఈ శివకుమార్ మాట్లాడుతూ 15 రోజుల కిందట పనులు తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఆరోగ్యకేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఆరోగ్యకేంద్రం నిర్మాణం తిరిగి చేపట్టడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బత్తాయి ధర.. పతనం

● నష్టాల ఊబిలో చీనీ రైతులు




బత్తాయికి మంగు సోకడంతో..



బత్తాయి కాయలకు మంగు సోకడం వల్ల ధర గణనీయంగా తగ్గింది. జాతీయ రహదారి కారణంగా దుమ్ము, ధూళి చెట్లపై పడడంతో అకారణంగా కాయలన్నీ నల్లగా మారిపోయాయి. పది క్వింటాళ్ల దిగుబడి వస్తుందంటే 4 క్వింటాళ్లే వచ్చింది.

- నరసింహారెడ్డి, చెన్నారెడ్డిపేట

50 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది..



దాదాపు 15 ఎకరాల్లో బత్తాయి సాగు చేశాను. వంద టన్నులు దిగుబడి వస్తుందని ఆశిస్తే 50 టన్నులు మాత్రమే వచ్చింది. ఎకరాకు 4టన్నులు దిగుబడి వచ్చింది. 15ఎకరాలకు మార్కెట్లో టన్ను రూ.12వేల వంతున అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది రూ.20వేలు పలికితే ఈసారి రూ.12వేలు మాత్రమే ధర పలికింది.

- సిద్దు గుర్విరెడ్డి, చెన్నారెడ్డిపేట

పోరుమామిళ్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల పెంపకం లాభదాయకంగా ఉంటుందని ఆశించి దాదాపు ఐదేళ్ల చెట్లను ఫలసాయం వచ్చేంత వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటే తీరా కాపునకు వచ్చేటప్పటికి దిగుబడి తగ్గడం, రేట్లు పతనం కావడంతో అయోమయంలో పడిపోయారు బత్తాయి సాగు చేసిన రైతన్నలు. పోరుమామిళ్ల వ్యవసాయ డివిజను పరిధిలో దాదాపు 900 ఎకరాల్లో బత్తాయి (చీనీ) తోటలు సాగు చేశారు. మండలంలో బొప్పాపురం చెన్నారెడ్డిపేట, పుల్లీడు ప్రాంతాల్లో 150 ఎకరాలు, కాశినాయన మండలంలో 350 ఎకరాలు, బి.మఠం మండలంలో 300 ఎకరాలు, కలసపాడు మండలంలో 60 ఎకరాలు, బి.కోడూరు మండలంలో 130 ఎకరాల వరకు రైతులు చీనీ తోటలను సాగు చేశారు. ఎకరాకు రూ.4లక్షల వరకు పెట్టుబడి పెట్టి ఎకరాకు 120 మొక్కల వరకు పెంచుతారు. ఈ చెట్లను దక్కించుకునేందుకు ఎరువు, మట్టి బోద వేసి కాల్చడం వంటి పనులు చేపడతారు. చెట్టుకు వేరుపురుగు పట్టకుండా చుట్ట బోద వేసి కాలుస్తారు. తీరా కాపునకు వచ్చేసరికి పంట దిగుబడి తగ్గడం, ధర లేకపోవడంతో దిగాలు పడిపోయారు రైతులు. క్వాలిటీ ప్రకారం ఫస్ట్ గ్రేడ్, సెకండ్ గ్రేడ్, థర్డ్ గ్రేడ్ ప్రకారం వ్యాపారస్తులు వాటికి ధరలు నిర్ణయిస్తారు. రూ.8వేల నుంచి రూ.16వేల వరకు గ్రేడ్‌ను బట్టి ధర పలుకుతుంది. ఎకరాకు కనీసం 10 నుంచి 13 టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. కానీ దిగుబడి సగానికి సగం పడిపోవడంతో ఎకరాకు 5, 6 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుంది. గత ఏడాది టన్ను రూ.20వేల ధర పలుకగా ప్రస్తుతం రూ.8వేలు, రూ.10వేలు, రూ.12వేల వరకు ఉంది. అంతేకాకుండా కొన్ని తోటల్లోని చీనీకాయలకు మంగు రావడంతో వ్యాపారస్తులు రేట్లను కూడా తగ్గిస్తున్నారు. బయట మార్కెట్లో వందకు మూడు కేజీలు వంతు అమ్ముతున్నా రైతులు మాత్రం రూ.10కే వ్యాపారస్తులకు అమ్మాల్సి వచ్చిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని, కష్టాలు కన్నీళ్లు నష్టాలే మిగిలాయని బత్తాయి రైతులు వాపోతున్నారు.

ఈ విషయమై ఉద్యానవనశాఖాధికారి శ్రీనివాసులరెడ్డిని వివరణ కోరగా బత్తాయికి రెండు సీజన్లలో కాపు వస్తాయని గ్రేడ్‌ను బట్టి రూ.8వేల నుంచి రూ.16వేల వరకు ధర పలుకుతుందని తెలిపారు. వేసవి సీజన్‌లో ధర పలికి తే రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.



గిట్టుబాటు ధర ఎక్కడ?

అట్లూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): చీనీ కాయలకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలో 1500 ఎకరాల్లో చీనీ సాగు చేశారు. ఎకరాకు ఆరు టన్నుల నుండి పది టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను రూ.30వేలకు దళారులు కొనుగోలు చేస్తే పెట్టుబడులు మాత్రమే వస్తాయని, రూ.30వేలకు పైబడి కొనుగోలు చేస్తే గిట్టుబాటు ధర ఉంటుందని పలువురు రైతులు చెబుతున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితి రూ.15 వేలు మాత్రమే ఉండటంతో పెట్టుబడులు కూడా రావని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీనీ కాయలను నెల్లూరు, మద్రాసుకు రవాణా చేసి దళారులు అక్కడ రూ.30వేలకు వరకు విక్రయిస్తూ రైతులను దగా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. 2004 నుండి 2019 వరకు చీనీతోటల పునరుద్ధరణ పేరుతో ప్రభుత్వం చీనీ తోటలు సాగు చేసిన రైతులకు ఎరువులు, చెట్ల కత్తిరింపు కత్తెరలు, ఎకరాకు రూ.12వేల చొప్పున ప్రోత్సాహం ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2022-23లో క్రాప్ డామేజ్‌కు ప్రభుత్వమే ఇన్సురెన్స్ డబ్బులు చెల్లించింది. 2024లో ప్రభుత్వం ఇన్సురెన్స్ డబ్బులు చెల్లించకపోవడంతో రైతులకు క్రాప్ డ్యామేజీ డబ్బులు అందలేదు. అదే బాటలో కూటమి ప్రభుత్వం కూడా ఇన్సురెన్స్ డబ్బులు చెల్లించకపోవడంతో చీనీ తోటలు సాగు చేసిన రైతులకు ప్రోత్సాహం కరువైంది. చీనీ కాయలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగంలో మెరుగైన సేవలు అందించాలి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వైస్‌చాన్సలర్, వైద్యులు

సీకేదిన్నె, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగంలో మెరుగైన సేవలు అందించాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. రాయచోటి రోడ్డులోని మాధవి కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిజీషియన్ అసోసియేషన్ 53వ కాన్ఫరెన్స్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలకు ఎంతో ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను పీజీ విద్యార్థులకు కల్పించి సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలన్నారు. సేవాదృక్పథంతో వైద్య వృత్తిని విస్తరించాలన్నారు. లాభాపేక్ష లేకుండా వృత్తి ధర్మానికి కట్టుబడి మెరుగైన సేవలు అందించినప్పుడే ప్రజల్లో గౌరవ మర్యాదలు దక్కుతాయన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా 800 మందికిపైగా వైద్యులు హాజరై వివిధ ఆవిష్కరణలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఫిజీషియన్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రిమ్స్‌లో సౌకర్యాలను మెరుగుపర్చండి

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కడప నగర శివార్లలో ఉన్న ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్) అభివృద్ధికి ప్రతి ఒక్క అధికారి కృషి చేసి వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన రిమ్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల హెచ్‌వోడీలతో సమావేశమయ్యారు. రిమ్స్ వైద్య కళాశాల చాలా విస్తీర్ణంగా ఉందని, ఆవరణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. వైద్య కళాశాల గెస్ట్ హౌస్, కళాశాల క్యాంటీన్, కళాశాల ఆడిటోరియం, ప్లే గ్రౌండ్‌ను త్వరలో ఏర్పాటు చేసేటట్లు దిశా నిర్దేశం చేశారు. ఆ తర్వాత వైద్య విద్యార్థులతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల డే, ఇతర ఫంక్షన్‌లను ఎలా జరుపుకొంటున్నారని అడగ్గా బయట ప్రాంతాలను బుక్ చేసుకొని వేడుకలు జరుపుకొంటున్నామని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రిమ్స్ ఆడిటోరియం పనులపై దృష్టి సారించాలని, ఆరు నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, వైస్ చాన్సలర్ విజయభాస్కర్‌రెడ్డి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూడు కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. జిల్లాకు చెందిన ఇద్దరికి అవకాశం లభించింది. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బద్వేల్‌కి చెందిన టీడీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డిని, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రొద్దుటూరు టీడీపీ నాయకుడు డాక్టర్ వడ్ల శ్రీనివాసాచారిని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది.

పాఠశాల కరస్పాండెంట్‌పై పోక్సో కేసు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పాఠాలు చెప్పాల్సిన గురువు, కూతురు వయస్సున్న బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించినందుకు శనివారం ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్‌పై మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మైదుకూరు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ బాలికతో ఆ పాఠశాల కరస్పాండెంట్ కొన్ని రోజులు క్రితం అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆ బాలిక జరిగిన విషయాన్ని ఎవ్వరికి చెప్పకుండా ఈనెల 11వ తేదీన విషద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో తల్లిదండ్రులు విషద్రావణం ఎందుకు తాగావని గట్టిగా అడగడంతో బాలిక తన పాఠశాల కరస్పాండెంట్ చేసిన నిర్వాకం బయట పెట్టింది. మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

పెద్దనపాడులో యువతి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనపాడు గ్రామంలో శనివారం రాత్రి యువతి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పెద్దనపాడుకు చెందిన గంగ(24) ఉరి వేసుకున్నట్లు తెలిపారు. ఆమె మృతికి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని, ఆ విషయమై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ప్రేమించిన వాడు మోసం చేయడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా బంధువులు ఆరోపిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై శనివారం రాత్రి ఎస్ఐ నాగమురళి బాధితులను విచారించారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో శనివారం నెల్లూరు-చిత్తూరు, అలాగే కర్నూలు-అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి.

ఏసీఏ క్రికెట్ మైదానంలో..: రిమ్స్ సమీపంలోని వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 554 పరుగులు చేసిన అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 96పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకే కుప్పకూలింది. దీంతో నెల్లూరు జట్టుకు 343 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. భారీ స్కోర్ సాధించే క్రమంలో రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 58 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో..: కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 410 పరుగులకు ఆలౌట్ అయింది. శనివారం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు 11.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 74 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 16.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసింది. దీంతో నిర్వాహకులు మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు ప్రకటించారు. కాగా కర్నూలు జట్టుకు మొదగి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత లభించింది.

కూటమి మైత్రికి భంగం కలిగిస్తున్న ఎమ్మెల్యే

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్న సంగతిని కడప ఎమ్మెల్యే మాధవి మరచిపోయారని, ఆమె కూటమి మైత్రికి భంగం కలిగించేలా బీజేపీ, జనసేన వారిని ఏమాత్రం సంప్రదించకుండా ఒంటెద్దు పోకడతో ముందుకు సాగుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 సంవత్సరంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రస్థాయిలో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా పనిచేస్తూ సుపరిపాలన అందిస్తున్నాయన్నారు. కాగా కడప జిల్లాలో మాత్రం టీడీపీ నాయకులు అందుకు విరుద్ధంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అత్యంత సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. అదే పంథాలో జిల్లాలోని టీడీపీ నాయకులు కూడా సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. సమావేశంలో బీజేవైయం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

చెన్నూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఊరేగింపు సందర్భంగా ఎస్సీలను అవమానకరంగా మాట్లాడి కులం పేరుతో దూషించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహులు అన్నారు. చెన్నూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక తూర్పువీధిలో ఎస్సీలు వినాయకచవితి సందర్భంగా గత నెల 28న ఊరేగింపు నిర్వహిస్తుండగా వచ్చే దారిలో ఓ వర్గంవారు ఊరేగింపును అడ్డుకోవడం, పలు రకాల మాటలు మాట్లాడడం జరిగిందన్నారు. పైగా కులం పేరుతో దూషించడం దారుణమన్నారు. ఈ విషయంపై తాము ఫిర్యాదు చేశామని, అయితే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి ఎస్సీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ వల్లూరు మండల అధ్యక్షుడు సురేశ్, చెన్నూరు మండల అధ్యక్షుడు రాంబాబు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు సుదర్శన్, వెంకటసుబ్బయ్య, గంగమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విచారణ : డీఎస్పీ

చెన్నూరులో వినాయక చవితి సందర్భంగా జరిగిన సంఘటనలో ఎవరికీ అన్యాయం జరగదని, నిష్పక్షపాతంగానే విచారణ జరుగుతోందని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన పలువురు తూర్పు దళితవాడకు చెందిన వారిని జరిగిన సంఘటనపై విచారించి వివరాలను రికార్డు చేసుకున్నారు.

రైల్వేస్టేషన్‌లో కిందపడి వృద్ధుడికి గాయాలు


కొండాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో కిందపడి శనివారం సుమారు 70 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడికి గాయాలయ్యాయి. ఇతడు స్టేషన్‌లో ట్రాక్‌పై ప్రమాదవశాత్తు జారిపడ్డాడా లేదా ఎదైనా ట్రైన్‌లో నుంచి జారిపడ్డాడా అని తెలియాల్సి ఉంది. ఇతని తలకు తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో తాడిపత్రికి తరలించారు. ఇతను రైల్వేస్టేషన్ పరిసరాల్లో బిచ్చమెత్తుకొని జీవిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఇతని వివరాలు తెలియరాలేదు.

మిద్దెకూలి వృద్ధురాలికి గాయాలు

కొండాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురంలో శనివారం దస్తగిరమ్మ(70) అనే వృద్ధురాలికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. ఈమె నివసిస్తున్న మట్టిమిద్దెలో ఇటీవల కురిసిన వర్షాలకు గోడలు మెత్తబడ్డాయి. దీంతో ఇంటి పైకప్పు కూలి దంతెలు విరిగి ఆమె మీద పడ్డాయి. తలకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో ఆమెను తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ పదోన్నతులలో పదనిసలొద్దు

● ఆర్టీసీ ఈయూ జోన్ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులలో పదనిసలకు తావు లేకుండా ప్రభుత్వంలో విలీనానికి ముందే చేరిన ఉద్యోగులకు విలీనానికి ముందున్న పాత పద్ధతుల్లోనే పదోన్నతులు కల్పించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఆర్టీసీ జోనల్ అధ్యక్షుడు కేకే కుమార్ అధ్యక్షతన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కడప జోన్‌కు చెందిన 8 జిల్లాల రాష్ట్ర, జోన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో జోన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీలో పదోన్నతులు కల్పించాలని కోరుతూ సంబంధిత ఉద్యోగసంఘాలు పలుమార్లు ఆర్టీసీ ఎండీ దృష్టికి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి గత నెల 28న ఆర్టీసీ ఉద్యోగులకు పాత పద్ధతుల్లోనే పదోన్నతులు ఇచ్చేలా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. ఇందుకు సంబంధించిన జీవో డ్రాఫ్ట్‌ను టీఆర్ అండ్ బీ అధికారులు జీఏడీ గత నెలలోనే పంపారన్నారు. అయినా అక్కడ ఉన్న ఒక అసిస్టెంట్ కమిషనరు స్థాయి అధికారి అనవసరంగా ఈ పదోన్నతులపై వాదనలు చేస్తూ అడ్డుకోవడం వల్ల ఆరేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఆరువేల మంది ఉద్యోగులు తీవ్ర నిరుత్సాహానికి గురవుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగులందరికీ గత ప్రభుత్వ హయాంలో జరిగిన రివర్స్ పీఆర్సీపై న్యాయం చేస్తారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటిస్తారని, 12వ పీఆర్సీ వేస్తారని, అలాగే 11వ పీఆర్సీకి సంబంధించిన 24నెలల అరియర్స్‌తో పాటు డీఏ అరియర్స్ కూడా ప్రకటిస్తారని ఎంతగానో ఎదురు చూస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరం అవుతున్నా ఇచ్చిన హామీల అమలులో జాప్యం చేస్తోందన్నారు. ఉద్యోగులు ఉద్యమ బాట పట్టకముందే త్వరితగతిన ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం మున్ముందు విజయవంతంగా ముందుకు సాగాలంటే ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవడం లేదని, మరో మూడు వేల బస్సులు కొనుగోలు చేయాలని, ఆర్టీసీ అన్ని కేటగిరిల్లో ఉన్న సుమారు 10వేల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టాలనుకుంటున్న విద్యుత్ బస్సులన్నీ ప్రైవేటు ఆపరేటర్లతో నడవకుండా ఆర్టీసీ సిబ్బందితో నడిపేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, సుబ్రమణ్యంరాజు, మద్దిలేటి, కడప జోనల్ వర్క్‌షాపు నాయకుడు అంకిరెడ్డి, ఏఆర్ మూర్తి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చింతపర్తిలో... - వాల్మీకిపురం బస్‌స్టాండ్ వద్ద కూటమి నేతలు, కార్యకర్తల సంబరాలు - తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత కొండ్రెడ్డి - కేక్ కట్ చేస్తున్న దగ్గుబాటి వేంకటేశ్వరరావు, తదితరులు - కలకడలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

మిన్నంటిన సంబరాలు

నల్లారి సోదరుల జన్మదిన వేడుకలు
పీలేరులో వంద కిలోల కేక్ కట్ చేసిన అభిమానులు

గుర్రంకొండ, సెప్టెంబరు 13: మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు మిన్నంటాయి. ఎటుచూసినా బాణసంచా పేలుళ్లు, జయజయధ్వానాలతో ఊరూ వాడా హోరెత్తించారు. పీలేరులో వంద కిలోల కేక్‌ను కట్‌చేసి భారీ జన సందోహం నడుమ వేడుకలు చేశారు. గుర్రంకొండలో 30 మందికిపైగా టీడీపీ నేతలు, యువకులు రక్తదానం చేశారు. మండల నలు మూలల నుంచి భారీ సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, నల్లారి కుటుంబ అభిమానులు, మహిళలు, ప్రజలు తరలివచ్చారు. వివరాల్లోకెళితే.... పీలేరు శాసనసభ్యుడు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను గుర్రంకొండలో పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను చేయించి టీడీపీ నేతలు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మూర్తిరావు. ఏఎంసీ చైర్మన్ నౌషాద్‌అలీ, నేతలు జగదీష్‌కుమార్, మహాత్మారెడ్డి, హరిప్రసాద్ నాయుడు, నౌషాద్‌అహ్మద్, ఎల్లుట్ల మురళీ, ప్రసాద్ నాయుడు, చలమారెడ్డి, మేకల చలపతి, బయ్యారెడ్డి, ప్రదీప్‌చంద్, చంద్రబాబు, ఇక్బాల్‌ఖాసీం, రెడ్డెప్పరెడ్డి, ఎస్.వెంకటరమణ, హెస్సాన్, విజయ్‌కుమార్, ఖాదర్‌వలి, శివయ్య, రామచంద్ర, హరియాదవ్, మధు, నక్కా సతీష్, నాగేంద్ర, శ్రీరాములు, శంకర, శివయ్య పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం....

వాల్మీకిపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నల్లారి సోదరుల జన్మదిన వేడుకలు మిన్నంటాయి. మండల వ్యాప్తంగా కూటమి పార్టీల ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు సంబరాలు చేసుకున్నారు. గాంధీ బస్ స్టాండ్ వద్ద బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. చౌడేశ్వరిదేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ, అన్నదానం, స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ చేపట్టారు. కార్యక



గుర్రంకొండలో రక్తదానం చేస్తున్న టీడీపీ నేతలు - పీలేరులో వందకిలోల కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు - ఎస్ఐకు ఇన్వర్టర్‌ను అందజేస్తున్న దగ్గుబాటి

మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జు నరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, జనసేన అధ్యక్షుడు పొలిమేర రెడ్డెప్ప, నేతలు నారాయణ, గాంధీపేట రమణ, కోసూరి రమేష్, మురళి, సురేంద్రవర్మ, రాజ గోపాల్, రామాంజులురెడ్డి, గోవిందు, సయ్యద్‌బాషా, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతపర్తి గ్రామంలో సర్పంచ్ మహితా శేషాద్రిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట కేక్ కట్ చేశారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ద్వారకనాథరెడ్డి, నేతలు శేషాద్రిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కేవీరెడ్డి, కువైట్ ఆది, హరినాథరెడ్డి, గుర్రెడ్డి చంద్రారెడ్డి, కాంతరాజుశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో పండుగ వాతావరణం

పీలేరు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నల్లారి సోదరుల జన్మదిన వేడుకలు పండుగ వాతావరణం కల్పించింది. మార్కెట్ కమిటీ ఆవణలో వంద కిలోల కేక్‌ను కట్‌చేశారు. వేడుకలకు హాజరైన వారందరికీ విందు భోజనం ఏర్పాటు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, కోటపల్లె బాబురెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి, సింగల్‌విండో అధ్యక్షుడు వై. రెడ్డెప్పరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఎన్. అమరనాథరెడ్డి, నేతలు షౌకత్‌అలీ, సురేంద్ర రెడ్డి, క్రాంతి కుమార్, బత్తుల ప్రసాద్, శ్రీహరిరెడ్డి, శ్రీనాథరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు గోళ్ల కిషోర్‌నాయుడు, కలప రవి, రామక్రిష్ణారెడ్డి, వసంతాల రాజ, జీ. వెంకటరత్నం, పీఏసీఎస్ డైరెక్టర్లు పుల్లయ్య, అమానుల్లా, ఆతికా షఫి, దామోదర్ రెడ్డి, కే. శ్రీకాంత్, గాయం వెంకటరెడ్డి, సుభాశ్, కే. ఆనందస్వామి, ఎం. చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు. విశ్వనాద్, స్పోర్ట్స్ మల్లి, ఎస్‌వీఎస్ఎస్ క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

పొత్తూరి ప్రభాకర నాయుడు ఆధ్వర్యంలో...

కలకడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నల్లారి సోదరుల జన్మదిన వేడుకలను కూటమి నేతలు చేసుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు పొత్తూరి ప్రభాకర నాయుడు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి నేతలు సంబరాలు చేసుకున్నారు. సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దిపట్ల వెంకటరమణనాయుడు, సర్పంచ్ లక్ష్మీప్రసన్న కమల్‌నాథ్, బరకం శ్రీనివాసులురెడ్డి, అబ్బూరి తిరుపతినాయుడు, బట్టా మల్లికార్జున నాయుడు, శిబ్యాల చంద్రమోహన్(చిట్టి), కోటరమణ, జి.త్యాగరాజు, రైసుమిల్లు రమణ, బి.వి.స్వామి, ఎనుగొండ శేఖర్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, ఇంజేటి తారకేశ్వర్, తెలుగు రైతు ఎం.వి. నాయుడు (బాబు), రామానాయుడు, పి.వి.నాయుడు, ఆనందరెడ్డి, పీరయ్య వెంకటరమణ, నౌషద్, జనార్ధననాయుడు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో...

కలకడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. బాటవారిపల్లిలోని ఎం.వి.రావ్స్ చిట్స్ కార్యాలయ అవరణలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. దగ్గుబాటి వేంకటేశ్వరరావు పోలీస్‌స్టేషన్‌కు రూ. 60 వేల విలువైన ఇన్వర్టర్, బ్యాటరీలను ఎస్ఐ రామంజనేయులుకు అందజేశారు. రాష్ట్ర జంగమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ వాసునూరి చంద్రశేఖర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లయన్‌లు వైవి రమణ, పునీత్‌చౌదరి, గంగాద్రినాయుడు, శ్రీనివాసులు నాయుడు, పి. వేంకటేశ్వరరావు. హరినాథనాయుడు, అబ్బూరి చంద్రబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే పుట్టిన సోదరులు

కలికిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలే ధ్యేయంగా నల్లారి సోదరులు అహర్నిశలూ పనిచేశారని నేతలు పేర్కొన్నారు. మండలంలో నల్లారి సోదరుల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ గ్రామాన టీడీపీ శ్రేణులు కేకులు కట్ చేసి పంచిపెట్టారు. రాష్ట్ర జంగమ సంక్షేమ కార్పొరేషన్ అధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్, తదితరుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్ రెడ్డి ఆధ్వర్యంలో యల్లమ్మ గ్రామదేవత ఆలయంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం పట్టణంలో దినకర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏఎంసీ చైర్పర్సన్ మాలతి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి, సర్వోదయ వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో రాష్ట్ర జంగం సంక్షేమ కార్పొరేషన్ అధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్, కలికిరి సింగిల్ విండో చైర్మన్ నల్లారి చంద్రకుమార్ రెడ్డి, కలికిరి మాజీ సర్పంచు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మాలతి, యోగేష్ రెడ్డి, దినకర్, కేవీ రెడ్డి, వెంకట రెడ్డి, సహదేవ రెడ్డి, మండల కురబ సంఘం అధ్యక్షుడు లక్ష్మన్న, సతీష్ రెడ్డి, మున్వర్, అస్లామ్, అఫ్రోజ్, చిన్నరెడ్డెయ్య, సల్లయ్య, గంగాధరయ్య, వెంకట్రమణ, సురేష్‌కుమార్ రెడ్డి, జ్ఞానమూర్తి, చంద్ర, వర్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో...


బీజేపీ కార్యాలయంలో మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు కుమార్ రెడ్డి, కృష్ణప్ప, మిషన్ సహదేవ రెడ్డి, రవీంద్రనాథ రెడ్డి, సుధాకర్, సైపుల్లా, మురళి, శ్రీనివాసులు, భాస్కర, కిరణకుమార్, వెంకట్రమణ తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మదనపల్లెలో...

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నల్లారి సోదరుల జన్మదిన వేడుకలను టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అన్వర్‌బాషా, రామచంద్రనాయుడు, మహేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, మల్లికార్జున, వేణు, శివకృష్ణ, గండికోట గణేష్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లె, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పీలేరు ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను తంబళ్లపల్లెలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ రాగిమాను కూడలి నుంచి స్థానిక ప్రభుత్వాస్పత్రి వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం వైద్యులు విక్రాంత్‌రెడ్డితో కలిసి రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొశెట్టి వెంకట్రమణ, సిద్దారెడ్డి, బోయపల్లె శివ, బీసీ నేత చంద్రశేఖర్, పీర్లమాబు, తుకారాం, ఐసులకిట్ట, టైలర్ మునాఫ్, కార్యకర్తలు పాల్గొన్నారు.





పీలేరులో అన్నదానం చేస్తున్న టీడీపీ నేతలు - నగరిపల్లెలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు - యల్లమ్మ ఆలయం వద్ద - మదనపల్లెలో జరిగిన వేడుకలు - కలికిరిలో వృద్ధులకు...

సమస్యలు రాకుండా ఉండేందుకే మరమ్మతులు

వాల్మీకిపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఎక్కడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే ప్రతి రెండో శనివారం మరమ్మతు పనులు చేపడుతున్నామని ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్ల పునరుద్ధరణ, 11కేవీ విద్యుత్ లైన్లపై ప్రమాదకరంగా మారిన చెట్లు తొలగింపు, తదితర సమస్యలన్నింటినీ పరిష్కరించారు. పట్టణంలో నెలకొన్న విద్యుత్ లైన్ల పునరుద్ధరణను పూర్తి చేశారు. ఏఈ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ జాకీర్‌హుస్సేన్, లైన్‌మెన్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌లో మరమ్మతు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

కళలకు వైభవం తెచ్చిన థిల్లానా

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, చౌడేశ్వరీ కళ్యాణ మండపంలో కళకు వైభవం తెచ్చిన థిల్లానా కార్యక్రమం నిర్వ హించారు. శనివారం థిల్లానా ది మెగా ఫెస్ట్ ఆఫ్ టాలెంట్ సాంస్కృతిక పోటీలను ప్రారంభించిన మదనపల్లె డీఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ కళలు మన భారత సంస్కృతికి చిహ్నాలని, వాటికి ఎప్పుడూ ప్రోత్సాహం అందిస్తూ గుర్తు చేసుకుంటూ ఉండాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా ముగిశాయన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ మహేంద్ర

847 కేసులు పరిష్కారం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కోర్టు సముదాయాల్లో లోక్‌అదాలత్‌లో 847 కేసులు పరిష్కారమయ్యాయి. రెండవ అదనపు జిల్లా జడ్జి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన అదాలత్‌లో 847 కేసులు రాజీ మార్గంలో పరిష్కారమయ్యాయి. ఇందులో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో ఒకే కేసులో బాధితులకు రూ.43, 23,096 పరిహారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోహర్, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



నల్లారి కిరణ్‌ది వినూత్న ఎదుగుదల



పీలేరులో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నేతలు

పీలేరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అతి పిన్న వయస్సులో ఎమ్మెల్యేగా గెలుపొంది, రాష్ట్ర చీఫ్ విప్‌గా, స్పీకర్‌గా, సీఎంగా వినూత్నమైన రాజకీయ ఎదుగదల కిరణ్ సొంతమని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి జన్మదినాన్ని బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఆధ్వర్యంలో బీజేపీ నేతలు కేక్ కట్ చేసి ప్రజలు, పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. ఆయన మాట్లాడుతూ అతి పిన్న వయస్సులో ఎమ్మెల్యేగా గెలుపొంది, రాష్ట్ర చీఫ్ విప్‌గా, స్పీకర్‌గా, సీఎంగా వినూత్నమైన రాజకీయ ఎదుగదల కిరణ్ సాధించారన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా రాజీవ్ యువకిరణాలు, ఇందిర జలప్రభ, ఎస్సీ, ఎస్టీ సబ్-ప్లాన్, రూపాయికి కిలో బియ్యం, శ్రీనిధి మహిళా బ్యాంకు, సాగు రైతుల రక్షణ చట్టం, ఆడ పిల్లల కోసం బంగారు తల్లి పథకం ప్రవేశ పెట్టారన్నారు. పీలేరు నియోజకవర్గం అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కిందని, ఆ ఫలాలు నేటికీ కనిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రమణ, నేతలు పురుషోత్తం, సుదర్శన్ రెడ్డి, పీఎంఖాన్, అశోక్ కుమార్ రెడ్డి, మస్తాన్, రెడ్డిఈశ్వర్, టీడీపీ నేత పురుషోత్తం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాల్మీకుల సమావేశం

వాల్మీకిపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి కార్యాచరణ ఏర్పాటు కోసం ఆదివారం ఉదయం 10గంటలకు కోనేటివీధిలోని శివాలయంలో జరిగే సమావేశానికి వాల్మీకులంతా తప్పక హాజరు కావాలని మండల మహర్షి వాల్మీకి సేవా సమితి అధ్యక్షుడు విష్ణుచైతన్య పిలుపునిచ్చారు. ప్రతి వాల్మీకి ఏడాదికి ఓ పర్యాయం పండుగగా భావించే వాల్మీకి జయంతిని ఈఏడాది వాల్మీకులందరూ కలిసి ఎంతో ఘనంగా చేసుకోవాలని, వాల్మీకి సోదరులందరూ అధిక సంఖ్యలో సమావేశానికి హాజరు కావాలని పలుపునిచ్చారు.

వైభవంగా శనీశ్వరుడికి మహాతైలాభిషేకం

వాల్మీకిపురం,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ధర్మపథం సమూహాలయంలో షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. సూర్యోదయాత్పూర్వం నుంచీ ఆలయంలో మూలవర్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. శనీశ్వర స్వామికి మహాతైలాభిషేకం, సప్తధాతు అభిషేకం, మహాకాల శని మృత్యుంజయ హోమం విశేషాలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమాల్లో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కేసులతో జీవితాలను దుర్భరం చేసుకోవద్దు

జాతీయ లోక్‌అదాలత్‌లో 82 కేసులు పరిష్కారం

వాల్మీకిపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కక్షలకు పోయి కేసులు పెట్టుకుని జీవితాలను దుర్భరం చేసుకోరాదని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ సూచించారు. శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు కార్యాచరణను దెబ్బతీసుకోకుండా రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ వేదికన్నారు. వివిధ కేసుల్లో రూ.70,12,319 నగదు రికవరీ, రూ.91,000 జరిమానా విధించారన్నారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రవిప్రకాష్, సెక్రటరీ ఆర్‌వీ ప్రసాద్, అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

పీలేరులో 78 కేసులు...

పీలేరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో 78 కేసులు పరిష్కారమయ్యాయి. పరిష్కారమైన కేసుల ద్వారా రూ.24,28,548ల చెల్లింపులు జరిగాయి. కార్యక్రమంలో 7వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శ్రీలత, పీజేసీజే జియావుద్దీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసీ పురుషోత్తం రెడ్డి, న్యాయవాదులు చిన్నరెడ్డప్ప, పీవీ రమణారెడ్డి, పోలీసు, ఎక్సైజ్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో 186 కేసులు....

తంబళ్లపల్లె, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి కీర్తన అన్నారు. లోక్ అదాలత్‌లో ఇరు వర్గాల కక్షిదారుల రాజీకి ఆమోదయోగ్యమైన పరిష్కారం పొందారు. ఓఎస్(డిక్లరేషన్)-1, సీసీ(ఐసీసీ)-11, ఓఎస్(పీఐ)-1, సీసీ(అడ్మిషన్)-4, ఎస్టీసీ(అడ్మిషన్)-163, పీఎల్పీ(బ్యాంకు)-6 కేసులు కలిపి మొత్తం 186 కేసులను పరిష్కరించారు. పరిష్కారమైన కేసుల ద్వారా రూ.3,21,200లు నగదును రికవరీ చేసినట్లు వివరించారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, సిబ్బంది, పోలీసులు కక్షిదారులు పాల్గొన్నారు.

టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

ములకలచెరువు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): టమోటాకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ సింగం రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక మార్కెట్‌లో జరుగుతున్న టమోటా వేలం పాటలను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకృష్ణ, గిరిబాబు, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మంగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సబ్సిడీతో ఎర్రగడ్డల పంపిణీ

పీలేరు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో నేటి నుంచి(ఆదివారం) సబ్సిడీతో ఎర్రగడ్డలు పంపిణీ చేస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ పురం రామూర్తి ప్రకటించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కిలో రూ. 10 చొప్పున ఆనియన్స్ పొందవచ్చన్నారు. మార్కెట్‌లో కిలో రూ. 25 నుంచి 30 అమ్ముతున్నారని, పట్టణ ప్రజలు, మహిళలు సబ్సిడీపై కొనుగోలు చేయాలని కోరారు. ప్రస్తుతం 15 టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. డైరెక్టర్ గోళ్ల కిషోర్‌నాయుడు, సెక్రెటరీ హరినాథ్, ఖాదర్, వెంకటరత్నం, శ్రీనాద్ తదితరులు పాల్గొన్నారు.





